5న ఆంధ్రజ్యోతి

ముత్యాల ముగ్గుల పోటీలు

వేదిక : ఖమ్మం రిక్కాబజార్ హైస్కూల్



ఖమ్మం సాంస్కృతికం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతిని పురస్కరించుకొని 'ఆంధ్రజ్యోతి' ముత్యాల ముగ్గుల పోటీలు ఈనెల 5వ తేదీన ఖమ్మం నగరంలో జరగనున్నాయి. స్థానిక పాత బస్టాండ్ ఎదురుగా గల రిక్కాబజార్ హైస్కూల్‌లో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ఈ పోటీలు జరుగుతాయి. సంక్రాంతి పండుగ వస్తుందంటే 'ఆంధ్రజ్యోతి' ముత్యాల ముగ్గుల పోటీని వెంట తీసుకు వస్తుందని మహిళలు భావిస్తారు. పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని బహుమతులు గెలుపొందేందుకు ఆసక్తిగా ఎదురు చూస్తారు. ఈ ఏడాది జిల్లాస్థాయి పోటీలు ప్రియదర్శిని గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ సహకారంతో ఏర్పాటయ్యాయి. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి రూ.6వేలు, ద్వితీయ బహుమతి రూ. 4వేలు, తృతీయ బహుమతి రూ. 3వేలు ఇస్తారు. జిల్లా స్థాయి విజేతను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. ముగ్గుల పోటీల్లో మహిళలు మాత్రమే పాల్గొనాలి. చుక్కల ముగ్గులు మాత్రమే వేయాలి. ఎన్నిచుక్కలు, ఎన్ని వరుసల ముగ్గులు వేసారో చెప్పగలిగి ఉండాలి. ముగ్గు, రంగులు తదితర అలంకరణ సామగ్రిని పోటీ దారులే తెచ్చుకోవాలి. ముగ్గు వేయటం రెండు గంటల్లో పూర్తి చేయాలి. మరిన్ని వివరాలకు 99661 15030, 96403 11380 నెంబర్లలో సంప్రదించవచ్చు.



రైతులకు సాగుసాయం అందించేందుకు రాష్ట్రప్రభుత్వం రూపొందించిన 'రైతు భరోసా' పథకాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు కసరత్తు జరుగుతోంది. సంక్రాంతి నుంచి ప్రారంభమయ్యే ఈ పథకంలో పలు మార్పులు జరగనున్నాయి. గత ప్రభుత్వంలో పట్టాభూములన్నింటికీ రైతు బంధు అమలు చేయగా ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం సాగుకు అనుకూలమైన భూములకే రైతు భరోసా అందించాలని ప్రాథమికంగా నిర్ణయించి.. ఆ దిశగా చర్యలు చేపట్టింది. ఈ పథకం అమలుకు విధివిధానాలు రూపొందించేందుకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన మంత్రివర్గ సబ్‌కమిటీని ప్రభుత్వం నియమించింది. ఈ కమిటీలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తదితరులు సభ్యులుగా ఉన్నారు. ఇప్పటికే ఈ కమిటీ రైతులు, మేధావుల అభిప్రాయాలు సేకరించి క్యాబినెట్‌కు నివేదిక అందించింది. దీనిపై క్యాబినెట్‌లో చర్చ జరిగిన తరువాత, విధివిధానాలు ఖరారు కానున్నాయి.

దున్నేవారికే 'భరోసా'

- పంట పండే భూములకే సాగుసాయం
- కొండలు, గుట్టలకు 'పెట్టుబడి' ఉండదు
- అక్రమాలకు చెక్ పెట్టేలా విధి విధానాలపై కసరత్తు
- కేబినెట్‌లో చర్చ తరువాతే పథకానికి తుదిరూపు

ఖమ్మం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన 'రైతు బంధు' పథకంలో సాగుతో సంబంధం లేకుండా పాస్‌బుక్‌లో ఉన్న అన్నిరకాల భూములకు సాగు సాయం అందించారు. దాంతో విలువైన ప్రజాధనం వృథా అయ్యిందని కాంగ్రెస్ ప్రభుత్వం విమర్శించింది. గతంలో సాగు భూములతోపాటు ప్రభుత్వం గతంలో నాగార్జునసాగర్ కాలువలకు, రహదారులకు, సింగరేణి, కేటీపీఎస్ వంటి పరిశ్రమలకు సేకరించిన భూములు ఇంకా రైతుల సాగులోనే ఉన్నట్లు రికార్డులు చూపిస్తున్నాయి. కొన్ని కొండలు, గుట్టలు కూడా రైతుల పేర్లతో పాసుపుస్తకాల్లో పట్టాలు కలిగి ఉన్నాయి. కొన్ని భూములు పాస్‌పుస్తకాలు, రెవెన్యూ రికార్డుల్లో ఉన్నా.. వాస్తవానికి ఆయా రైతులకు వాస్తవంగా ఆ భూములు లేవు. ఇలాంటి పరిస్థితుల్లో గత ప్రభుత్వం 'ధరణి' ఆధారంగా 'రైతుబంధు' అమలు చేయడంతో రూ.వేల కోట్ల నిధులు వృథా అయినట్టు ఆరోపణలు వచ్చాయి. సాగుభూమి లేకపోయినా రైతుగా భావించి ఎకరానికి రూ.10వేల చొప్పున రైతుబంధు అందించారన్న ఆరోపణలున్నాయి.

బీఆర్ఎస్ హయాంలో...

ఖమ్మం జిల్లాలో వానాకాలం పంటకు 7,25,854 ఎకరాలకు 3,29,892మంది రైతులకు రూ.362.94 కోట్లు 'రైతుబంధు' సాయంలో భాగంగా రైతుల ఖాతాల్లో జమ చేశారు. వేసవిలో 3,33,967మంది రైతులకు రూ.7,26,706 ఎకరాలకు రూ.363.35కోట్లు రైతుల ఖాతాల్లో వేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వానాకాలం 1,72,533మంది రైతులకు 5,22,155 ఎకరాలకు రూ.261.07 కోట్లు, యాసంగిలో 1,77,646 మంది రైతులకు 5,36,337 ఎకరాలకు రూ.268.17కోట్లు రైతుబంధు నిధులు జమ చేశారు. బీఆర్ఎస్ హయాంలో ఉమ్మడి జిల్లాలో ఏటా రూ.1255.53 కోట్లు రైతుల ఖాతాల్లో జమచేశారు. అయితే ఇలా సాగు సాయం పొందిన భూముల్లో పదినుంచి 15 శాతం సాగులేక పోయినా పట్టాలున్నందున సాగుసాయం అందించారు.

'రైతుభరోసా'లో మార్పులు

కాంగ్రెస్ ప్రభుత్వం 'రైతుబంధు' పథకాన్ని రైతు భరోసాగా మార్చి పెట్టుబడి సాయం అందించేందుకు కసరత్తు చేస్తోంది. రూ.15వేల సాగు సాయంలో భాగంగా సంక్రాంతి నుంచి యాసంగికి సంబంధించి ఎకరానికి రూ.7500 పెట్టుబడి సాయం పొందేందుకు రైతులు తమ సాగు వివరాలు, పట్టా వివరాలను తెలుపుతూ రైతులు దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. గ్రామాల్లో ఏఈవోలు, ఏవోలకు 5వ తేదీ నుంచి దరఖాస్తులు తీసుకుని క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం వారికి రైతు భరోసా ఇవ్వనున్నారు. తద్వారా నిధుల దుర్వినియోగానికి కొంత అడ్డుకట్ట పడే అవకాశం ఉంది. అయితే ఏజెన్సీలో సాగులో ఉండి పట్టాలేని గిరిజనేతర రైతుల పరిస్థితి మాత్రం గందరగోళంగానే ఉంది. ఎన్నో ఏళ్లుగా చేతిలో భూములున్నా గిరిజనేతరులకు ఏజెన్సీ నిబంధనలతో పాసుపుస్తకాలు లేకపోవడంతో వారు రైతుభరోసా అందుకోలేని పరిస్థితి ఉంది. 4వ తేదీన జరిగే క్యాబినెట్ మీటింగ్‌లో ఏజెన్సీలోని గిరిజనేతర రైతుల సాగుభూములకు రైతుభరోసా అమలు విషయంలో ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపైనే వీరికి భరోసా అందుతుందా లేదా అన్నది తేలాల్సి ఉంది.

మూడేళ్ల బాలికపై లైంగిక దాడి

నిందితుడు 17 ఏళ్ల బాలుడు



అశ్వారావుపేట రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మూడేళ్ల బాలికపై 17ఏళ్ల బాలుడు లైంగిక దాడికి పాల్పడగా పోలీసులు కేసు నమోదు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలుడు ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం తమ గ్రామానికి చెందిన మూడేళ్ల బాలికను ఆటోలో తిప్పుకొస్తానని చెప్పి వెంట తీసుకెళ్లాడు. వరుసకు బాబాయి కావడంతో చిన్నారి తల్లిదండ్రులకు కూడా అనుమానం రాలేదు. అయితే ఆటోను గ్రామ శివారుకు తీసుకెళ్లి అక్కడ చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం చిన్నారి ఏడ్చుకుంటూ ఇంటికి వచ్చింది. దీనిని గమనించిన తల్లి విషయం తెలుసుకుని గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై ఎస్ఐ యయాతిరాజు విచారణ చేసి చిన్నారిని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించారు. బాలుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వివరించారు.

ట్రాన్స్‌ఫార్మర్ చోరీ చేస్తూ..

విద్యుత్‌షాక్‌తో మృతిచెందిన వ్యక్తి



చుంచుపల్లి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చోరీ చేసే క్రమంలో షాక్ తగలడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటన కొత్తగూడెం టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. సీఐ రమేష్‌కుమార్ కథనం మేరకు.. రామవరం త్రీఇంక్లైన్ ప్రాంతానికి చెందిన తుమ్మ నిరంజన్ (25) మరో నలుగురితో కలిసి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి చుంచుపల్లి మండలంలోని రాంపురం పంచాయతీ ప్రాంతంలోని పొలంలోకి వెళ్లాడు. విద్యుత్ సరఫరాను నిలిపివేసే క్రమంలో షాక్‌కు గురై మృతిచెందాడు. దీంతో చోరీకి వచ్చిన మిగతా నలుగురు పరారయ్యారు. ఈ సంఘటనపై చుంచుపల్లి ఏఈ నరసింహారావు, మృతుడి తల్లి అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతుడు అవివాహితుడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని ఇంటికి తరలించారు.

ప్రాణం తీసిన ఆన్‌లైన్ గేమ్స్

డబ్బులు పోగొట్టుకొని మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య



కూసుమంచి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ గేమ్‌లో డబ్బులు పోగొట్టుకున్న ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన కూసుమంచి మండలంలోని గైగొళ్లపల్లి గ్రామంలో గురువారం జరిగింది. పోలీసుల, తల్లిదండ్రుల కథనం ప్రకారం... కోరట్ల ఉపేందర్ (38) ఆటో నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నా డు. డబ్బుపై ఆశతో కొంత కాలంగా ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతున్నాడు. తల్లిదండ్రులు పలుమార్లు మందలించినా వినకపోవడంతోపాటు వ్యసనంగా మారి డబ్బులు పోగొట్టుకున్నాడు. ఈ విషయం కుటుంబసభ్యులకు చెప్పేవాడు కాదు. ఈ క్రమంలో మానసిక ఒత్తిడికి గురై గురువారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కూలి పనులు ముగించుకుని వచ్చిన కుటుంబసభ్యులు ఉపేందర్ ఉరి వేసుకుని ఉండటాన్ని చూసి వెంటనే పక్కింటివారితో కలిసి కిందకు దింపారు. అప్పటికే మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం నేలకొండపల్లి తరలించారు. తండ్రి అప్పయ్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్టు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్

Can Fin Homes Ltd

బ్రాంచి చిరునామా: ఇం.నెం. 15-8-1105, 1వ అంతస్తు, వరదయ్య నగర్, మమత హాస్పిటల్ రోడ్, ఖమ్మం-507002

ఫోన్: 08742-298955, సెల్ నెం. 7625079213, CIN No. L85110KA1987PLC008699

డిమాండ్ నోటీసు

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 (నెం.54 యొక్క 2002) లోని సెక్షన్ 13(2) క్రింద

వీరికి: 1) శ్రీ పూస కిరణ్ కుమార్ తండ్రి పూస ఉపేందర్ (లేట్) వృత్తి: వ్యాపారం (ఋణగ్రహీత), 2) శ్రీమతి పూస సరోజిని భర్త పూస ఉపేందర్ (లేట్) వృత్తి: వ్యాపారం (సహ-ఋణగ్రహీత), ఇం.నెం. 11-9-55/ఏ, బుర్హాన్‌పురం, ఖమ్మం జిల్లా, ఖమ్మం-507001.

మీ ఇరువురికి చెందిన ఈ క్రింది తెలిపిన ఆస్తిని తనఖా ఉంచి మీలోని నం.1 & 2లు అయిన మీరు మా శాఖ నుండి గృహ ఋణం పొందినారు. కెన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్ వారికి మీరు రూ. 22,72,773/- (రూపాయలు ఇరవై రెండు లక్షల డెబ్బై రెండు వేల ఏడు వందల డెబ్బై మూడు మాత్రమే) లు బకాయి అయినారు మరియు తేది: 31-12-2024 నుండి తదుపరి భవిష్య వడ్డీని కాంట్రాక్టు రేటు ప్రకారం సదరు సొమ్ముపై చెల్లించవలసియున్నది.

తనఖా పెట్టిన ఆస్తి షెడ్యూలు:

ఖమ్మం జిల్లా మరియు జాయింట్ సబ్ రిజిస్ట్రార్ ఖమ్మం, ఖమ్మం మున్సిపల్ పరిధిలోని బుర్హాన్‌పురం వద్ద 83.40 చ.మీ.లకు సమానమైన 99.75 చ.గ.ల విస్తీర్ణంలో నెంబర్ 11-9-55/ఏ కలిగిన ఇల్లు యావదాస్తి. సరిహద్దులు: తూర్పు: ప్లాట్ నెం. ఎస్. సోమలక్ష్మీ, పడమర: మున్సిపల్ రోడ్డు, ఉత్తరం: మున్సిపల్ రోడ్డు, దక్షిణం: ప్లాట్ నెం. పి. అనిత.

SARFAESI యాక్ట్, 2002లోని సెక్షన్ 13(2) క్రింద మీకు రిజిస్టర్డ్ డిమాండ్ నోటీసు పంపబడినది, కానీ అది అందజేయబడకుండా తిరిగి వచ్చినది. కావున దిగువ సంతకందారు సదరు చట్టం ప్రకారం సదరు ఋణగ్రహీత/ల యొక్క తెలిపిన ఆఖరి చిరునామా ఆవరణములలో ఈ నోటీసులు అతికించడమైనది. కావున ఈ పత్రికా ప్రచురణ చేయడమైనది. మంజూరు నిబంధనలను పాటించుటలో మీరు విఫలమైనందున, ఖాతా ఎన్‌పిఏని మార్గదర్శకాల ప్రకారం 29-12-2024న నిరర్థక ఆస్తిగా వర్గీకరించడమైనది. ఈ నోటీసు తేది నుండి 60 రోజులలోగా పైన తెలిపిన మొత్తాన్ని మరియు దానిపై 31-12-2024 నుండి అంగీకరించిన రేటు వంతున వడ్డీతో తిరిగి చెల్లించవల్సిందిగా మిమ్మల్ని కోరడమైనది, విఫలమైనచో దిగువసంతకందారు పైన తెలిపిన సెక్యూరిటీని అమలు చేయుటకు SARFAESI చట్టము క్రింద తగిన చర్యలు తీసుకొనుటకు ముందుకుసాగెదరు. తదుపరిగా సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు లభించే సమయానికి సంబంధించి చట్టములోని సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8)లోని నిబంధనలను గమనించవల్సిందిగా ఋణగ్రహీతలను/హామీదారులను కోరడమైనది.

తేది: 02-01-2025, ప్రదేశం: ఖమ్మం

సం/- అధీకృత అధికారి, కెన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్





మంత్రి ఇంట న్యూ ఇయర్ సందడి

- క్యాంపు కార్యాలయంలో ఘనంగా నూతన సంవత్సర వేడుకలు
- శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్, సీపీ

ఖమ్మం సంక్షేమ విభాగం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంలోని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో గురువారం రాత్రి నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కేక్ కట్ చేసి కార్యకర్తలకు తినిపించారు. ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, అర్హత కలిగిన ప్రతి వ్యక్తికి ప్రభుత్వ పథకాలు చేరాలని మంత్రి సూచించారు. ఈ సందర్భంగా భద్రాద్రి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైన చీకటి కార్తీక్‌ను మంత్రి సన్మానించారు. కాంగ్రెస్ పార్టీకి యువజన కాంగ్రెస్ పునాదిలా పనిచేస్తోందని పేర్కొన్నారు. తెలంగాణ వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గరికె ఉపేందర్ ఆధ్వర్యంలో వీఆర్వోలు మంత్రిని కలిసి తమ సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు.

మంత్రిని కలిసిన కలెక్టర్, సీపీ

మంత్రి పొంగులేటిని క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, పోలీసు కమిషనర్ సునీల్‌దత్, డీపీఆర్వో గౌస్‌పాషా, ఇతర ప్రభుత్వశాఖల అధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులు కలిసి పుష్పగుచ్ఛాలను అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల క్యాలెండర్లు, డైరీలను మంత్రి ఆవిష్కరించారు. కొత్త సంవత్సరంలో ప్రభుత్వ పరిపాలన మరింత పటిష్టంగా ఉండాలన్నారు.

మళ్లీ తెరపైకి ఎయిర్‌పోర్టు

- రామవరంలో ఏర్పాటుపై అధ్యయనానికి ఫీజు చెల్లించాలన్న కేంద్రం
- వెంటనే చర్యలు తీసుకోవాలంటూ మంత్రి తుమ్మల లేఖ
- సానుకూలంగా స్పందించిన మంత్రి కోమటిరెడ్డి

కొత్తగూడెం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెంలో గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణం మళ్లీ తెరపైకి వచ్చింది. ఎయిర్‌పోర్టు నిర్మాణం చేపట్టాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావులు గతంలో వేర్వేరుగా కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడికి వినతిపత్రాలను అందజేశారు. కొత్తగూడెం సమీపంలోని రామవరం నుంచి గరిమెళ్లపాడు ప్రాంతంలో సుమారు 950ఎకరాల్లో ఉన్న ప్రభుత్వ భూమిలో ఎయిర్‌పోర్టు నిర్మాణం జరిపేందుకు అనుకూలంగా ఉంటుందని వారు ఆ లేఖలో కేంద్రమంత్రికి వివరించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన 950 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) ప్రీ ఫీజబిలిటీ స్టడీ (ప్రాజెక్టుపై అధ్యయనం) నిర్వహించేందుకు రూ.41లక్షలు ఖర్చు అవుతుందని, దీనికిగాను రాష్ట్ర ప్రభుత్వం రూ.41లక్షల ఫీజును చెల్లించాలని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు లేఖ రాశారు. సదరు ఫీజును చెల్లిస్తే కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టు సాధ్యాసాధ్యాలపై కేంద్ర అధ్యయన బృందం వచ్చి సర్వే నిర్వహిస్తారని తెలిపారు.

ఈ క్రమంలో మంత్రి తుమ్మల వెంటనే స్పందించి ఏఏఐ తన బృందంతో అధ్యయనం చేపట్టేందుకు రూ.41లక్షలు వెంటనే డిపాజిట్ చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి లేఖలో సూచించారు. దీనిపై స్పందించిన కోమటిరెడ్డి ఒకటి, రెండు రోజుల్లో ప్రభుత్వంతో చర్చించి ఫీజు చెల్లింపుపై నిర్ణయాన్ని తీసుకుంటామని తెలిపారు. వరంగల్‌లోని మామునూరు, కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి కేంద్రం సన్నాహాలు చేస్తున్న విషయం విదితమే.



నటుడు ప్రియదర్శితో సెల్ఫీ దిగిన మహిళలు

మధిరలో 'బలగం' హీరో

మధిరటౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): బలగం హీరో ప్రియదర్శి గురువారం మధిరలోని ఓ షాపింగ్ మాల్‌కు వచ్చారు. మధిర మండలం మర్లపాడుకు చెందిన ఆయన బంధువు ఒకరు మధిరలో నివసిస్తుండగా వారి ఇంటికి వచ్చిన ప్రియదర్శి.. వారి కోసం టీవీ కొనుగోలు చేసేందుకు మధిరలోని ఓ మాల్‌కు టోపీ, మాస్క్ ధరించి వచ్చి టీవీ కొనుగోలు చేసి వెళ్లే క్రమంలో షాపులోని సేల్స్ గర్ల్స్ గుర్తించారు. ఈ లోపులో కారు ఎక్కిన ఆయనతో వారు సెల్ఫీ దిగి మరోసారి షాపునకు రమ్మని కోరగా ఆయన సున్నితంగా తిరస్కరించి వెళ్లిపోయారు.

సమష్టి వ్యవసాయం

» 19 ఏళ్లుగా ఆకుకూరల సాగు » ఆదర్శంగా నిలుస్తున్న ముగ్గురు రైతులు

మధిర రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ముగ్గురు పేద దళిత రైతులు ఐక్యం గా కలిసి 19ఏళ్లుగా ఆకుకూరల సాగు చేస్తూ పలువురు రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు మధిర మునిసిపాలిటీ పరిధిలోని మడుపల్లి గ్రామానికి చెందిన పిల్లి జయరాజు, చింతల బాలశౌరి, పారా ప్రసాద్‌లు. వీరు ముగ్గురు దళిత పేద రైతులు. వీరి మధ్య బంధుత్వం ఉంది. మడుపల్లిలో గత 19ఏళ్లుగా వీరు ముగ్గురు కలిసి ఎకరంన్నర పొలాన్ని కౌలుకు తీసుకొని ఆకుకూరల సాగు చేస్తున్నారు. ఈ ముగ్గురు కుటుంబాల దంపతులే కష్టపడి సాగుచేస్తున్నారు.

రకరకాల ఆకుకూరల సాగు...

వీరు ముగ్గురు కలిసి రకరకాల ఆకుకూరలను పండిస్తున్నారు. బచ్చలకూర, తోటకూర, పాలకూర, చుక్కకూర, మెంతికూర, గోంగూర వంటి ఆకుకూరలు వేశారు. విత్తనాలను విజయవాడ, కుంచనపల్లి వంటి ప్రాంతాల నుంచి కొనుగోలు చేసుకుంటారు. ఆకుకూరల విత్తనాలను చల్లిన 30నుంచి 40రోజులకు ఆకుకూరల మొదటి కోత వస్తుందని రైతులు తెలిపారు. ఒకసారి విత్తనాలు చల్లితే నాలుగు నుంచి ఐదుకోతలు వచ్చేవరకు ఈ ఆకుకూరలను ఉంచుతామన్నారు. కూలీలను పెట్టుకోకుండానే ఈ ముగ్గురు రైతుల దంపతులు, వారి పిల్లలు ఉదయం నుంచి సాయంత్రం వరకు బిజీబిజీగా గడుపుతుంటారు.

ద్విచక్రవాహనాలపై తిరుగుతూ...

మడుపల్లిలో జయరాజు, బాలశౌరి, ప్రసాద్ అనే రైతులు పండించిన ఆకుకూరలకు మంచి డిమాండ్ ఉంది. సాయంత్రం నాలుగుగంటల నుంచి ఆరు గంటల వరకు పండించిన ఆకుకూరలను కోసి పొలంలోనే కట్టలు కడతారు. తెల్లవారుజామున ద్విచక్ర





వాహనాలపై తిరుగుతూ ఆకుకూరల అమ్మకాలు చేస్తుంటారు. ముఖ్యంగా మడుపల్లి గ్రామంతోపాటు ఎక్కువగా మధిర పట్టణంలో ఆకుకూరల అమ్మకాలు సాగిస్తుంటారు. ఉదయం 5గంటలనుంచి 9గంటలవరకు ఈ ముగ్గురు అమ్మకాలు చేసే కార్యక్రమంలో బిజీగా ఉంటారు.



కష్టాన్నే నమ్ముకున్నాం..

పిల్లి జయరాజు, రైతు

ఆకుకూరల సాగు చేపట్టాం. కష్టాన్నే నమ్ముకొని ముందుకు సాగుతున్నాం. ఉదయం నుంచి సాయంత్రం వరకు పొలంలోనే సరిపోతుంది. ఆకుకూరలకు ఎప్పుడూ డిమాండ్ ఉంటుంది.



సాగు సంతృప్తిగా ఉంది

చింతల బాలశౌరి, రైతు,

ఆకుకూరల సాగు చేపట్టాక ఆర్థికంగా ఫర్వాలేదు. కొంత నిలదొక్కుకున్నాం. వచ్చిన లాభాలను సమానంగా పంచుకుంటున్నాం.మా దగ్గర అన్ని ఆకుకూరలు దొరుకుతాయి.



బ్యాంకులు రుణం ఇవ్వాలి

పారా ప్రసాద్, రైతు,

తాము నిరుపేద దళిత రైతులం. ఇంతవరకు బ్యాంకులు తమకు ఏ రుణం ఇవ్వలేదు. రుణసహాయం అందజేస్తే మరింత పొలం కౌలుకు తీసుకొని ఆకుకూరలను ఇంకా పెద్ద మొత్తంగా సాగుచేస్తాం.



మాట్లాడుతున్న శాంత సదానందగిరి బాబా

ప్రకృతి పరిరక్షణ

మానవ ధర్మం

108 ఏళ్ల బాబా శాంత సదానందగిరి హితవు

ఏన్కూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): సమస్త జీవరాసుల మనుగడకు ఆధారమైన ప్రకృతిని పరిరక్షించడం మానవ ధర్మమని 108 ఏళ్ల బాబా శాంత సదానందగిరి హితవు పలికారు. గురువారం ఏన్కూరు మండలం నాచారంలోని సంకల్ప సమాధి యోగ ఆశ్రమాన్ని ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ సమస్త జీవులకు ప్రాణవాయువు ఫలాలు, సహజ వనరులను సమకూర్చే పర్యావరణాన్ని కాపాడుకోవాలన్నారు. ప్రకృతికి విరుద్ధంగా స్వార్థంకోసం విచక్షణ రహితంగా చెట్లను నరికివేస్తూ అడవులు అంతరింపచేస్తే భవిష్యత్తు లేకుండా పోతుందన్నారు. ప్రకృతి సంరక్షణ, ఆరోగ్యం ఆనంద భరితమైన జీవనాన్ని అలవర్చేందుకు యోగాచార్యులు డాక్టర్ ప్రేమ్ నిరంతర్ మల్లేష్ గురూజీ ఆధ్వర్యంలో నాచారంలో ఆశ్రమం నెలకొల్పడం సంతోషదాయకమన్నారు. ఆశ్రమం అభివృద్ధికి ఎల్లవేళలా తమ వంతు సహాయ సహకారాలుంటాయన్నారు. అనంతరం అద్భుత వేంకటేశ్వరస్వామి దేవాలయాన్ని బాబా సందర్శించారు. ఆయనకు ఆలయ ప్రధాన అర్చకుడు నల్లాన్ చక్రవర్తుల శ్రీనివాసాచార్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్‌వై వ్యవస్థాపకుడు డాక్టర్ ప్రేమ్‌నిరంతర్ మల్లేష్‌గురూజీ, నిర్వాహకులు ధారా విష్ణుమోహన్‌రావు, జవ్వాజి నరసింహారావు, నంబూరు మోహన్‌రావు, వీవీ ప్రసాద్, కోటయ్య, ముత్యం, నిమ్మకంటి దామోదరప్రసాద్, దుగ్గిదేవర అజయ్‌కుమార్, కర్నాటి లక్ష్మారెడ్డి, బెల్లంకొండ ఆంజనేయులు, బి.నరసింహారావు పాల్గొన్నారు.

ఉద్యోగులకు ఇచ్చిన హామీలను

అమలు చేయాలి

యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి

బోనకల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి డిమాండ్ చేశారు. బోనకల్‌లో గురువారం జరిగిన ఆ సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెండింగ్ డీఏలను ఇవ్వాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, పీఆర్సీ నివేదికను తెప్పించి మెరుగైన ఫిట్‌మెంట్‌ను ఇవ్వాలని కోరారు. కేజీబీవీ, సమగ్రశిక్ష ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రాథమిక విద్య బలోపేతానికి గానూ నర్సరీ, కేజీ తరగతులను ప్రవేశ పెట్టాలని, నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను భర్తీ చేయాలని, గురుకులంలో పని చేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ రంజాన్, జిల్లా కార్యదర్శి గుగులోతు రామకృష్ణ, నాయకులు నెల్లూరి వీరబాబు, సదాబాబు, గోపాలరావు, కమలాకర్, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి

22లోగా ఓపెన్ స్కూల్

పరీక్ష ఫీజు చెల్లించాలి

ఖమ్మం ఖానాపురంహవేలి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం హైద్రాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించే 2024-25 విద్యా సంవత్సర పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఫీజును ఆ నెల 9 నుంచి 22వ తేదీలోగా చెల్లించాలని జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర వర్మ, ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ పాపారావులు గురువారం తెలిపారు. పదో తరగతి అభ్యర్థులు థియరీ పరీక్షలకు సబ్జెక్టుకు రూ.100, ప్రాక్టికల్స్ సబ్జెక్టుకు రూ.150, ఇంటర్మీడియట్ అభ్యర్థులు థియరీ సబ్జెక్టుకు రూ.150, ప్రాక్టికల్స్‌కు రూ.150లు చెల్లించాలని తెలిపారు. రూ.25ల అపరాధ రుసుంతో ఈ నెల 29వరకు, రూ.50ల అపరాధ రుసుంతో ఫిబ్రవరి 3 వరకు, సాధారణ ఫీజుతోపాటు తత్కాల్ ఫీజులతో పదో తరగతికి రూ.500, ఇంటర్మీడియట్‌కు రూ.1000చొప్పున ఫిబ్రవరి 6 వరకు ఫీజు చెల్లించవచ్చని తెలిపారు.

బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడులు చేస్తే సహించం

రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్

తిరుమలాయపాలెం, జనవరి2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే బీఆర్ఎస్ కార్యకర్తలపై అధికార పార్టీ కార్యకర్తలు దాడులకు పాల్పడుతున్నారని, దానికి సహించబోమని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పేర్కొన్నారు. మండలంలోని సుద్దవాగుతండాకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త బానోతు మల్లిఖార్జున్‌పై కాంగ్రెస్ కార్యకర్తలు దాడిచేసి తీవ్రంగా కొట్టారని, వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని జిల్లా పోలీసు అధికారులను కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బీఆర్ఎస్ కార్యకర్తలకు రక్షణ లేకుండా పోయిందని వారు ఆరోపించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసు యంత్రాంగం చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు పోలీసులు తక్షణం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్, తిరుమలాయపాలెం మండల అధ్యక్షుడు బి.వీరన్న, బానోతు రవి, అప్పారావు, మహర్షి, పాల్గొన్నారు.



మమతా ఆసుపత్రిలో బీఆర్ఎస్ కార్యకర్త మల్లిఖార్జున్‌ను పరామర్శిస్తున్న ఎంపీ వద్దిరాజు, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యే సండ్ర

సాయిబాబా ఆలయంలో

ప్రత్యేక పూజలు

బాబాను దర్శించుకున్న డైరెక్టర్ సుకుమార్ సోదరుడు విజయ్



ఆలయంలో సుకుమార్ సోదరుడు విజయ్, కుటుంబ సభ్యులు

భద్రాచలం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీషిర్డీసాయి బాబా ఆలయంలో గురువారం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాబాకు అభిషేకం, అర్చన జరిపి స్వర్ణ ఆభరణాలతో అలంకరించి హారతి పాడారు. అనంతరం లిటిల్‌ఫ్లవర్స్ విద్యాసంస్థల అధినేత మాగంటి సూర్యం జ్ఞాపకార్థం వారి కుమారులు మాగంటి ప్రసాద్, మాగంటి రమేష్‌బాబులు అన్నదానం నిర్వహించారు.అలాగే బాబా వారిని ప్రముఖ సినీ దర్శకుడు సుకుమార్ సోదరుడు విజయ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ కమిటీ అధ్యక్షుడు తుమ్మలపల్లి సత్యనారాయణమూర్తి, కుంచాల రమేష్ పాల్గొన్నారు.

మందకొడిగా వ్యాపారాలు

» తగ్గుతున్న బేరాలు
» కొత్తగూడెంలో ఖాళీ అవుతున్న దుకాణాలు
» దర్శనమిస్తున్న 'టులెట్' బోర్డులు
» వ్యాపారుల్లో ఆందోళన

లక్ష్మీదేవిపల్లి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో వ్యాపారాలు మందకొడిగా సాగుతున్నాయి... ఎవరి నోట విన్నా బేరాలు లేవు అన్న మాటే వినిపిస్తోంది. అందుకు నిదర్శనంగా పట్టణంలో ఎక్కడ చూసిన టులెట్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. ఒకప్పుడు పెద్దబజార్, చిన్నబజార్, ఎంజీరోడ్ లాంటి ప్రధాన మార్కెట్లలో ఒక్క షాపు అద్దెకు దొరికితే చాలు అనుకునేవారు. కానీ ప్రస్తుత పరిస్థితి భిన్నంగా ఉంది. ప్రధాన మార్కెట్లలో అనేక 'టులెట్' బోర్డులు దర్శనమిస్తోన్నా యి. నెలలు గడుస్తున్నా.. అద్దెకు వచ్చేవారు కన్పించడం లేదు. నిత్యావసర సరుకులు మినహాయిస్తే మిగతా ఏ వ్యాపారమైనా అంతంతమాత్రంగానే నడుస్తున్నాయి. కొత్తగా వ్యాపారంలోకి వచ్చిన వారు కొద్దిరోజులకే దుకాణాలు మూసేస్తున్నారు. ఎన్నడూలేని విధంగా వ్యాపారాలు నత్తనడకన సాగుతుండటంతో షాపులకు అద్దెలు చెల్లించడం కూడా భారంగా మారిందని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. వ్యాపారాలు తగ్గడానికి అనేక కారణాలూ ఉన్నాయి...

ఆన్‌లైన్ వ్యాపారం అధికమవడం...

ఆధునిక వ్యాపారాల్లో పోటీ పెరిగింది. ఆన్‌లైన్ వ్యాపార వ్యవస్థ శరవేగంగా విస్తరిస్తుండటంతో ఇలా ఆర్డర్ పెడితే అలా కోరింది ఇంటి వద్దకే వస్తోంది. జొమాటో, స్విగ్గీ, అమేజాన్ వంటి ఇతరత్రా సంస్థలు ఇంటి వద్దకే కావల్సిన వస్తువులను చేరవేస్తున్నాయి. దీంతో వినియోగదారులు మార్కెట్‌కు వెళ్లి కొనుగోలు చేసి సమయం వృథా చేసుకోవాల్సిన పరిస్థితి లేకుండా పోయింది. ఆన్‌లైన్‌లో తమకు నచ్చింది ఆర్డర్ పెట్టి ఇంటివద్దకే తెచ్చుకుంటున్నారు. అంతేకాదు వ్యాపారంలో వస్తున్న పోటీతో ధరల్లో కూడా వ్యత్యాసం ఉంటోంది. ఆన్‌లైన్‌లో తక్కువ ధరలకే లభిస్తుండటం వినియోగదారులు అటువైపు మొగ్గు చూపుతున్నారు.

తగ్గుతున్న సింగరేణి కార్మికులు...

సింగరేణి కార్మిక ప్రాంతమైన కొత్తగూడెంలో రోజురోజుకు ఉపాధి అవకాశాలు తగ్గుతున్నాయి. బొగ్గు గనులు మూతపడటం, కొత్త పరిశ్రమలు ఏర్పడకపోవడం ఇక్కడ స్థిరపడేవారి జనాభా తగ్గడంతో పాటు వినియోగదారుల్లో కొనుగోలు శక్తి క్షీణిస్తోంది. దీంతో వాళ్లపైన ఆధారపడ్డ వ్యాపారాలు కుదేలవుతున్నాయి. పదేళ్ల క్రితం కొత్తగూడెం కార్పొరేట్, ఏరియాలో సింగరేణిలో పని చేసే కార్మికులు సుమారు 6వేల మంది ఉంటే ప్రస్తుతం 4,500 మంది ఉన్నట్టు సమాచారం.

నగరాల బాటపడుతున్న ప్రజలు..

విద్య, వైద్య రంగాల్లో మెరుగైన ఆధునిక సౌకర్యాలు లేకపోవడంతో ఇక్కడి ప్రజలు నగరాల బాటపడుతున్నారు. హైదరాబాద్, బెంగుళూరు, ఖమ్మం తదితర ప్రాంతాల్లో స్థిరపడేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.



అంతేకాకుండా కొత్తగూడెం చుట్టుప్రక్కన ఎక్కువగా అటవి భూములు ఉండటం వ్యాపార అభివృద్ధికి ఆటంకంగా మారింది. ఒకవైపు ఏజెన్సీ ప్రాంతం.. మరోవైపు సింగరేణి భూములు కావడంతో వ్యాపార అభివృద్ధికి అనేక ఆంక్షలు తెరపైకి వస్తోన్నాయి. పాలకుల శాపమో... అధికారుల అలసత్వమో కానీ, గత కొన్నేళ్లుగా కొత్తగూడెం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిందనడంలో అతిశయోక్తిలేదు.

రేపు ఖమ్మం నగరంలో జాబ్ మేళా

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులుప్రైవేట్ రంగం అయిన క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ్ లిమిటెడ్ కంపెనీలో ట్రైనీ కేంద్ర మేనేజర్‌గా ఉద్యోగాలు కల్పించేందుకు శనివారం మోడల్ కెరీర్ సెంటర్ (ప్రభుత్వ ఐటిఐ., టేకులపల్లి) ఖమ్మంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారిణి ఎన్.మాధవి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 50 ఉద్యోగ ఖాళీల భర్తీ చేసేందుకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.

అనుమానిస్తూ గొడవ పడుతున్నాడని..

నిద్రిస్తున్న మామపై వేడి నూనె పోసిన కోడలు

గతనెల 28న ఘటన.. 31న మామ మృతి

భద్రాద్రి జిల్లా కారేపల్లి మండలంలో ఘటన

కారేపల్లి, జనవరి 2:(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా కారేపల్లి మండలంలో దారుణం చోటు చేసుకుంది. కోడలి దాడిలో గాయపడ్డ మామ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన డిసెంబరు 31న జరగగా, గురువారం వెలుగు చూసింది. కారేపల్లి మండల పరిధిలోని ఫైల్ తండాకు చెందిన అజ్మీరబాబు(60)కు తన కోడలు ఉమతో తరచుగా గొడవలు జరుగుతుండేవి.. అజ్మీరబాబు కుమారుడు కొన్ని సంవత్సరాల క్రితం కొవిడ్‌తో మృతి చెందాడు. అప్పటినుంచి బాబు అతడి భార్య, కోడలు ఉమ, ఆమె పిల్లలు ఒకే ఇంట్లో ఉంటున్నారు. అయితే కోడలు ఉమ విహహేతర సంబంధం పెట్టుకుందని మామ బాబు అనుమానించి తరచుగా ఆమెతో గొడవకు దిగేవాడు. దీంతో విసుగు చెందిన ఉమ గతనెల 28న బాబు ఇంట్లో నిద్రిస్తుండగా వేడిచేసిన నూనెను అతడిపై పోసింది. తీవ్రంగా గాయపడ్డ అతడిని వరంగల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ 31న మృతిచెందాడు. కాగా, ఈ విషయమై సీఐ తిరుపతి రెడ్డిని వివరణ కోరగా, బాబు చనిపోయిన రోజు ఆయన భార్య రత్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు. కారేపల్లి మండలంలోని అత్యంత మారుమూల తండాలో ఈ ఘటన జరగడంతో బాహ్య ప్రపంచానికి తెలియలేదు. గురువారం టీవీ చానెళ్లలో దీనిపై కథనం రావడంతో కలకలం రేగింది.

బీజేపీ విధానాలు దేశానికి ప్రమాదకరం: నున్నా

ఏన్కూరు, జనవరి2(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ అనుసరిస్తున్న విధానాలు దేశానికి అత్యంత ప్రమాదకరమని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరరావు ఆందోళన వ్యక్తంచేవారు. గుడ్ల వెంకటేశ్వరరావు నివాస ఆవరణలో గురువారం వైరా డివిజన్ ముఖ్యకార్యకర్తల విస్తృ తస్థాయి సమావేశం బానోతు బాలాజీ అధ్యక్షతన జరిగింది. ముందుగా రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడూతూ మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ అంబేద్కర్‌ను అవమానించడం అంటే దేశ ప్రజలను అవమానించిట్లేనని పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలోని నల్లచట్టాలను తిరిగి తెచేందుకు కుట్రజరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలముందు ఇచ్చిన ఆరుగ్యారంటీలను అమలుచేయకుంటే మార్చి నుంచి పెద్దఎత్తున ఆందోళనలు చేయడానికి సన్నద్ధమవుతున్నట్టు హెచ్చరించారు. ఈనెల 25నుంచి సంగారెడ్డిలో జరిగే రాష్ట్ర సమహాసభలను జయప్రదం చేయాలని కార్యకర్తలను కోరారు. ఈనెల 23 నుంచి జరిగే గడపగడపకు సీపీఎం కార్యక్రమాన్ని ప్రజలు ఆదరించాలని కోరారు. జిల్లా కార్యవర్గసభ్యులు భూక్యా వీరభద్రం మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ప్రజా ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఈకార్యక్రమంలో డివిజన్ నాయకులు తాళ్లపల్లి కృష్ణ, సుంకర సుధాకర్, చింతనిప్పు చలపతిరావు, మచ్చ మణి, దంతేబోయిన నాగేశ్వరరావు, కుందనపల్లి నరేంద్ర, చెరుకుపల్లి కుటుంబరావు, అంబటి శ్రీనివాసరావు, ఏర్పుల రాములు, లెనిన్, గుడ్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

రేపు ఖమ్మంలో కళాకారుల ఎంపిక

కళాకారుడు తోకల రవి ప్రసాద్

బూర్గంపాడు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీగేయ రచయత, వాగ్గేయకారుడు ప్రజా కవి వరంగల్ శ్రీనివాస్ రచించిన 'నూరేళ్ల నా ఊరు గేయ' కావ్యం 243చరణాలతో 243మంది గాయని గాయకుల చేత పాడించాలనే సంకల్పంతో కళాకారుల ఎంపిక శనివారం ఉదయం 9గంటల నుంచి ఖమ్మం పట్టణంలోని అంబేద్కర్ భవనంలో నిర్వహించడం జరుగుతుందని ప్రముఖ కళాకారుడు తోకల రవిప్రసాద్ తెలిపారు. గురువారం బూర్గంపాడులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కళాకారుల ఎంపిక కార్యక్రమం అనంతరం పెద్ద ఎత్తున పాట ప్రదర్శన, అవిష్కరణ కార్యక్రమం ఉంటుందని రెండు తెలుగు రాష్ట్రాల నుంచి అనేక మట్టి గొంతులను వెలికితీసి ఈ పాటలో భాగస్వామ్యం చేయాలనే ఆలోచనతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్న పేర్కొన్నారు. నూరెండ్ల ఊరు ఎట్లుండెను ఆనాటి ప్రజల జీవన స్థితిగతులు ఏ విధంగా ఉన్నాయో, సమాజం ప్రస్తుతం ఎంత మార్పు జరిగిందో, మనుషుల్లో వచ్చినటువంటి మార్పుని మానసిక పరిస్థితులను గురించి విపులంగా విశదీకరించే కవితాత్మకంగా రాసిన సుదీర్ఘ గేయ కావ్యం పాడడం కోసం కళాకారులను ఎం పిక చేయడం జరుగుతుందన్నారు.

పాడే పాటలకు న్యాయనిర్ణేతగా 'నూరేళ్ల నా ఊరు గేయ'కావ్య రచయిత వరంగల్ శ్రీను, ప్రజా గాయకుడు సిద్దెల హుస్సేన్ పాల్గొంటారని ఆయన తెలిపారు. ఉమ్మడి జిల్లా కళాకారులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నూతన సంవత్సరం ఆనందంగా సాగాలి

వేడుకల్లో ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : 'ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు మీ సహకారం అవసరం... అంకితభావంతో పని చేస్తేనే జిల్లా అభివృద్ధి సాధ్యం అవుతుంది' అని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పేర్కొన్నారు. నూతన సంవత్సర వేడుకలను గురువారం కలెక్టరేట్‌లో తన చాంబర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, పి.శ్రీనివాస్ రెడ్డి, ట్రెయినీ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులతో కలిసి కేక్ కట్ చేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నూతన సంవత్సరం ప్రతి ఒక్కరిలో ఆనందం నింపాలని ప్రభుత్వ ఉద్యోగులు వారి కుటుంబాలలో సంతోషం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. నూతన సంవత్సరంలో ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలైన ఇందిరమ్మ ఇళ్లు, అర్హులకు గ్యారెంటీ పథకాల అమలు, అభివృద్ధి చర్యలు, జాతీయ రహదారుల నిర్మాణం వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా జరిగేలా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టర్ కోరారు. విధుల్లో నిబద్ధతతో పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని ఆయన సూచించారు. క్రమశిక్షణతో ఉండి, మంచి పేరు తెచ్చుకోవాలని కోరారు.. ప్రతి ఉద్యోగీ వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, మంచి ఆ హారపు అలవాట్లు అలవర్చుకోవాలని, రోజూ శారీరక వ్యాయామం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

‘సమగ్ర శిక్ష’ ఉద్యోగుల ర్యాలీ

సీఎం, జిల్లా మంత్రుల మాస్కులతో నిరసన

ఖమ్మం ఖానాపురంహవేలి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హనుమకొండలో ఇచ్చిన హామీ మేరకు సమగ్ర శిక్షా ఉద్యోగుల క్రమబద్ధీకరణ అమలు చేయాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో గురువారం ఖమ్మం నగరం పెవీలియన్‌గ్రౌండ్ నుంచి సీఎంరేవంతిరెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరారావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఫేస్ మాస్కులు ధరించి పాతబస్టాండు, వైరా రోడ్డు, జడ్పీ సెంటర్, ఇల్లందు క్రాస్ రోడ్ మీదుగా ఐటీహబ్ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. సుమారు 400 మంది ఎస్ఎస్ఏ ఉద్యోగులు 23వరోజు భారీర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో యూనియన్ మెంబెర్స్ ఉమెన్స్ ప్రెసిడెంట్ ఎం.విజయ లక్ష్మి, సెక్రటరీ లచ్చిరాం కృష్ణ ప్రసాద్, కే.అనిల్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ షేక్ ఇస్మాయిల్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



ఖమ్మంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

యథేచ్ఛగా ఇసుక దందా

- చిన్నమండవ, తిమ్మినేనిపాలెం మున్నేటి నుంచి రవాణా
- తూతూమంత్రంగా అధికారుల తనిఖీలు

చింతకాని మండలంలో ఇసుకదందా జోరుగా సాగుతోంది. మున్నేటి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని స్వయాన ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను హెచ్చరించినా.. అక్రమ రవాణాకు అడ్డుకట్టపడలేదు. ప్రభుత్వ ఖజానాకు ఆదాయం సమకూర్చే మున్నేటి ఇసుక అక్రమార్కుల జేబులు నింపుతోంది. అధికారులు తూతూమంత్రంగా తనిఖీ నిర్వహిస్తుండటంతో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ఇసుక తరలించే అక్రమార్కులకు అధికారుల అండదండలు ఉన్నాయని విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

చింతకాని, జనవరి2 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది సెప్టెంబరు, అక్టోబరు నెలలో కురిసిన భారీ వర్షాలకు మున్నేరు ఉప్పొంగడంతో భారీగా ఇసుక మేటలు వేసింది. ప్రస్తుతం పట్టణాలు, గ్రామాల్లో ఇంటి నిర్మాణ పనులు, మరమ్మతులు ఊపందుకోవడంతో ఇసుకకు డిమాండ్ పెరిగింది. ఖమ్మం పరిసర ప్రాంత మండలాల్లోని గ్రామాల్లోని చిన్న చిన్న ఇంటి నిర్మాణాలకు సంబంధించిన మరమ్మతులకు మున్నేరు ఇసుకే దిక్కు. దీంతో ఇసుక అక్రమ రవాణా దారులు పెరిగిన డిమాండ్‌ను ఆసరాగా చేసుకోని ఇసుకను తరలించి లక్షలు గడిస్తున్నారు. ఇసుక నాణ్యతను బట్టి ఒక్కో ట్రక్కు ఇసుక సుమారు రూ.8నుంచి15 వేల వరకు ధర పలుకుతోంది. దూరాన్ని బట్టి ఆ ధర మారుతుండటంతో అక్రమ రవాణా దారులు పండుగ చేసుకుంటున్నారు.

వరదలు వచ్చిన నాలుగురోజులే..

వరదలు వచ్చిన నాలుగు రోజులు తప్ప మిగతా రోజులన్నీ ట్రాక్టర్ల మోతతో మున్నేరు ప్రాంతం దద్దరిల్లుతోంది. గత నవంబరు నెల లోనే సుమారు 3 వేలకు పైగా ఇసుక ట్రాక్టర్ల అక్రమ రవాణా జరిగినట్లు సమాచారం. రాత్రి, పగలు తేడా లేకుండా రోజూ దాదాపు వందల ట్రాక్టర్ల ఇసుక తరలిపోతుంది. అడపాదడపా అధికారులు దాడులు చేసి ట్రాక్టర్లను పట్టుకున్నప్పటికి నామమాత్రపు చలానాలతో బయటపడి తిరిగి ఇసుక అక్రమ రవాణా కొనసాగిస్తున్నారు. అక్రమార్కులకు నిత్యం ఇది షరా మామూలుగానే మారిపోయింది.

రాత్రి సమయాల్లో అధికం

ఇసుక అక్రమ రవాణా ఎక్కువగా రాత్రి సమయాల్లో కొనసాగుతుంది.ఈఇసుక అక్రమ దందాకు కొందరు ప్రభుత్వ అధికారులు, రాజకీయ నాయకుల అండదండలున్నాయనే విమర్శలు వస్తున్నాయి. ట్రాక్టర్లలో నింపిన ఇసుకను తెల్లవారేసరికి దొడ్డిదారుల ద్వారా గమ్యానికి తరలిస్తున్నారు.రాత్రిసమయం కావడంతో ఎక్కువగా జనసంచారం ఉండదు కాబట్టి అక్రమార్కులు చీకటి దందా కొనసాగిస్తున్నారు.



మున్నేరు, ఇసుకను తోలుతున్న ట్రాక్టర్లు

ట్రాక్టర్లకు ఎస్కార్ట్‌లు

మున్నేటి నుంచి ఇసుకను ట్రాక్టర్లలో నింపి మండలంతో పాటు కొణిజర్ల, వైరా, ఖమ్మం నగరానికి అధికారుల కన్నుకప్పి దొడ్డిదారిన చేరవేస్తున్నారు. అందుకు మండలంలోని పలు వ్యవసాయ డొంకలను ఇసుక రవాణాకు దారులుగా ఎంచుకున్నారు. అధికారుల పర్యవేక్షణ కరువైనపుడు యథేచ్ఛగా మెయిన్ రోడ్ల ద్వారానే ట్రాక్టర్లను తరలిస్తారు. ఇసుక అక్రమ రవాణా పకడ్బందీగా ఎస్కార్ట్‌ల ద్వారా కొనసాగిస్తారు. ఎస్కార్ట్‌లు ట్రాక్టర్‌కు కిలోమీటర్ దూరంలో ముందుస్తుగా బైక్‌పై వెళ్తూ క్లియరెన్స్ సమాచారాన్ని ట్రాక్టర్ డ్రైవర్లకు ఫోన్‌లో చేరవేస్తూ ఉంటారు. ట్రాక్టర్ గమ్యానికి చేరేవరకు ఎస్కార్ట్‌లు చాకచక్యంగా వ్యవహరిస్తారు. మామూళ్లకు అలవాటు పడి అధికారులు ఇసుక అక్రమరవాణాకు సహకరిస్తున్నట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు.

కూలీలపై దూసుకెళ్లిన లారీ టైరు

- ఇద్దరు మహిళలకు గాయాలు

తిరుమలాయపాలెం, జనవరి2 (ఆంధ్రజ్యోతి):రన్నింగ్‌లో ఉన్న లారీ టైర్ ఊడి వ్యవసాయకూలీలపై దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఇద్దరు మహిళలకు గాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం మండలలో జరిగింది. కరీంనగర్ వైపునుంచి చిప్స్ లోడుతో లారీ వస్తోంది. ఈక్రమంలో ఖమ్మంరూరల్ మండలం కొత్తూరుకు చెందిన వ్యవసాయకూలీలు పనికి వెళ్లి బస్సు కోసం పాపాయిగూడెం స్టేజీవద్ద ఉన్నారు. ఈక్రమంలో కరీంనగర్ నుంచి ఖమ్మం వెళుతున్న లారీ టైరు ఊడి కూలీలపై పడింది. దీంతో ఇద్దరు మహిళలకు గాయాలయ్యాయి. కరీంనగర్ నుంచి వస్తున్న ఈలారీలు బైపాస్‌రోడ్డు నిర్మాణానికి చిప్స్ లోడుతో వెళుతున్న లారీలు తీవ్రవేగంగా వస్తున్నాయని, దీనితో లారీలోని దుమ్ముధూళి లేచి వాహనదారుల కళ్లలో పడి ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

ఖమ్మంక్రైం, జనవరి2 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఖానాపురంహవేలి పోలీసులు తెలిపారు. నగర పరిధిలోని ధంసలాపురం కాలనీకి చెందిన నారపోగు నాగేశ్వరరావు ఆయన కుమారుడు ప్రసాద్ కూరగాయల షాపులో గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్లుగా చేసి అమ్ముతున్నారు. పక్కా సమాచారం రావడంతో గురువారం ఖానాపురంహవేలి పోలీసులు తనిఖీలు నిర్వహించారు. షాపులో 155 గ్రాముల గంజాయి దొరకడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. వారిపై కేసునమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

తండ్రి అస్థికలు కలపడానికి వెళ్లి కుమారుడి మృతి

15 రోజుల వ్యవధిలో తండ్రి, కొడుకుల మృతితో చర్లలో విషాదం

చర్ల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): గత నెల 17న తండ్రి అనారోగ్యంతో మృతి చెందగా, అతని అస్థికలు కలిపేందుకు భద్రాచలం వెళ్లిన కొడుకు బుధవారం రాత్రి మృతి చెందాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండల కేంద్రానికి చెందిన ఎడ్ల గోపాలం (80) గత నెల 17న మృతి చెందాడు. బుధవారం తండ్రి అస్థికలు కలిపేందుకు భద్రాచలంలోని గోదావరి ప్రాంతానికి బుధవారం అతని కొడుకు ఎడ్ల వెంకటేశ్వర్లు (50) వెళ్లాడు. ఇదే క్రమంలో భద్రాచలం రోడ్ మీద నడుస్తూ వెంకటేశ్వర్లు పడిపోయారు. తలకు తీవ్రమైన గాయం కావడంతో అక్కడికి అక్కడే మృతి చెందాడు. గురువారం ఉదయం భద్రాచలం చేరుకున్న కుటుంబ సభ్యులు మృతదేహన్ని చర్లకు తరలించారు. కుటుంబంలోని ఇద్దరు కొద్ది రోజుల వ్యవధిలో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. గోపాలానికి నలుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. గత ఏడాది చిన్న కుమారుడు చనిపోయాడు. ఈ 15 రోజుల్లో తండ్రి, పెద్ద కుమారుడు మృతి చెందడం ప్రతీ ఒక్కరినీ కంట తడి పెట్టిస్తుంది.



గోపాలం, వెంకటేశ్వర్లు (ఫైల్)

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పాల్వంచ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మనస్తాపానికి గురై ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆ ఘటనకు కారకుడైన వ్యక్తిపై పాల్వంచ రూరల్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం పాల్వంచ మండలం బంద్రుగొండ గ్రామానికి చెందిన కంటే సంపత్ బుధవారం తన గొర్రెలు మేపడానికి పొలానికి తోలుకెళుతున్నాడు. ఈ క్రమంలో దారిలో తన స్నేహితులతో అక్కడ ఉన్న పాకాల వెంకట్రావుతో సంపత్‌కు మధ్య వాగ్వాదం జరిగింది. సంపత్‌పై వెంకట్రావు దాడిచేయడంతో సంపత్‌కు గాయాలయ్యాయి. సంపత్ ఆసుపత్రికి వెళ్లి చికిత్స తీసుకున్నాడు. అదే రోజు రాత్రి వెంకట్రావు తన అనుచరులతో సంపత్ ఇంటికి వెళ్లి చంపుతానని బెదిరించాడు. దీంతో మనస్తాపానికి గురైన సంపత్ ఉదయం ఇంట్లోని పురుగుల మంది తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో కుటుంబ సభ్యులు అతనిని హుటాహుటిన పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి కొత్తగూడెం ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో అతనిని వరంగల్ ఎంజీఎంకు తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితుడి పిన తండ్రి కంటే భద్రయ్య ఫిర్యాదు మేరకు వెంకట్రావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ సురేష్ తెలిపారు.

చోరీ కేసులో ఆరు నెలల జైలు

జూలూరుపాడు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో చోరీకి పాల్పడిన కేసులో ఖమ్మం జిల్లా కల్లూరుకు చెందిన నిందితుడు కడ్గా శ్రీనివాసరావుకు ఆరు నెలలు జైలు శిక్షను విధిస్తూ గురువారం కొత్తగూడెం జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ న్యాయాధికారి ఎ. సుచరిత తీర్పు ఇచ్చినట్లు జూలూరుపాడు ఎస్ఐ బి. రవి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్ దిల్‌సుఖ్ నగర్‌కు చెందిన దివ్వెల సుబ్బలక్ష్మి అనే మహిళ 2015 మార్చిలో వెంకటాపురం వెళ్లేందుకు దిల్‌సుఖ్‌నగర్‌లో భద్రాచలం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఎక్కింది. సదరు మహిళ నిద్రపోయింది. సుమారు తెల్లవారుఝామున 2:15గంటల సమయంలో జూలూరుపాడుకు వచ్చే సరికి ఆమెకు మేల్కొవచ్చింది. ఆమె హ్యాండ్‌బ్యాగ్ కనిపించకపోవడంతో జూలూరుపాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆ బ్యాగులో రూ.లక్ష విలువ చేసే 2.8 గ్రాముల బంగారపు చెవిదిద్దులు, 2.10 గ్రాముల లాకెట్, సెల్ ఫోన్ పోయినట్లు ఫిర్యాదులో పేర్కొంది. దీంతో సదరు మహిళకు చెందిన సెల్‌ఫోన్ ఐఎంఈఐ నెంబరు ద్వార నిందితుడ్ని పోలీసులు అప్పట్లోనే పట్టుకున్నారు. అతని వద్ద నుంచి బంగారాన్ని రికవరి చేసి కోర్టులో హాజరుపరిచారు. 8మంది సాక్షులను విచారించి నేరం రుజువు కావడంతో మెజిస్ట్రేట్ నిందితుడికి జైలు శిక్షను విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

నాటు సారా విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

జూలూరుపాడు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : నాటు సారాను తయారు చేసి విక్రయిస్తున్న ఓ వ్యక్తిపై గురువారం సాయంత్రం జూలూరుపాడు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. సాయిరాంతండాలో సారా తయారు చేసి అమ్మకాలు సాగిస్తున్నారన్న సమాచారం అందడంతో ఎస్ఐ రవి సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. గ్రామంలోని తేజావత్ కిషన్ అనే వ్యక్తి నుంచి 4లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేశారు.

సీఎం కప్ పోటీల్లో జిల్లా క్రీడాకారుల హవా

- పలు జిల్లాల్లో వివిధ విభాగాల్లో రాష్ట్రస్థాయి పోటీలు
- వివిధ పోటీల్లో విజయం సాధించిన క్రీడాకారులు

ఖమ్మంస్పోర్ట్స్, జనవరి2(ఆంధ్రజ్యోతి): సీఎం కప్‌రాష్ట్రస్థాయి పోటీలు డిసెంబరు 27 నుంచి రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటి పతకాలు సాధించారు. మహబూబ్‌నగర్‌లో డిసెంబరు 31 నుంచి జనవరి 2 వరకు జరిగిన రాష్ట్రస్థాయి నెట్‌బాల్ ఫైనల్స్ పోటీల్లో జిల్లా మహిళల జట్టు ఆతిథ్య మహబూబ్‌నగర్ జట్టుపై 26-06 స్కోరు తేడాతో గెలుపొంది టైటిల్ నిలబెట్టుకోగా, పురుషుల జట్టు మహబూబ్‌నగర్ జట్టుపై 16-19 స్కోరు తేడాతో పరాజయం పొందింది. ద్వితియ స్థానంలో నిలిచి రన్నరప్ టైటిల్‌ను సాధించింది.హన్మకొండలో డిసెంబరు 31నుంచి జనవరి 2జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో బాలుర, బాలికల జట్లు సత్తా చాటి మొత్తం 12 స్వర్ణ, 2కాంస్య పతకాలు సాధించారు. మైథిలి 100మీటర్ల పరుగు పోటీ, లాంగ్‌జంప్‌లో రెండు స్వర్ణ పతకాలు సాధించగా, నరేష్ జావెలిన్‌త్రోలో స్వర్ణం, గౌతమ్ 100, 200 మీటర్ల పరుగు పోటీలో రెండు స్వర్ణ పతకాలు, షాట్‌పుట్‌లో రాజరాజేశ్వరి, హజీరాఫాతిమా, మజీద్‌పాషా తలా ఒక స్వర్ణ పతకం సాధించారు. 100లో స్వర్ణం,వైశాలి100 మీటర్ల పరుగు పోటీ, లాంగ్ జంప్‌లో రెండు స్వర్ణాలు, బిందు 400 మీటర్ల పరుగు పోటీలో కాంస్యం,జావెలిన్‌త్రోలో స్వర్ణం, మస్తాన్ 400 మీటర్ల పరుగు పోటీలో స్వర్ణం, క్రిష్ణవేణి జావెలిన్‌త్రోలో కాంస్యపతకాలు సాధించారు. రాష్ట్రపోటీలలో ప్రతిభ చూపిన జిల్లాక్రీడాకారులను డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి, అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా సెక్రెటరీ షఫీ, కోచ్ గౌస్, నెట్ బాల్ సంఘం జిల్లా బాధ్యులు అభినందించారు.



నెట్‌బాల్ పోటీలలో ప్రథమ బహుమతి సాధించిన ఖమ్మం జిల్లా మహిళల జట్టు, ద్వితీయ బహుమతి సాధించిన జిల్లా పురుషుల జట్టు

మున్నేరు వరద నియంత్రణకు పకడ్బందీ చర్యలు

- మున్నేరు నదికి ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మాణం
- భూసేకరణపై అధికారులతో కలెక్టర్ సమీక్ష

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మున్నేరు వరద నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. గురువారం కలెక్టర్ తన క్యాంప్ కార్యాలయంలో ఖమ్మం మునిసిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణం, భూసేకరణ అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. మున్నేరు నది కిరువైపుల రిటైనింగ్ వాల్ నిర్మాణానికి బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్, డిజైన్, గత రికార్డుల ప్రకారం అత్యధిక నీటి ప్రవాహం స్థాయి ఎంత, రిటైనింగ్ వాల్ ఎంత ప్రవాహానికి ఎంత ఎత్తులో నిర్మించాలి లాంటి అంశాలను సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. బఫర్ జోన్ వద్ద ఎంత భూమి ఆక్రమణకు గురైంది, మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణానికి ఎంత సమయం పడుతుంది, ఎంత భూసేకరణ చేయాలి, వచ్చే వానాకాలం నాటికి పూర్తి చేసే అవకాశాలు ఉన్నాయా, రాబోయే వరదల నియంత్రణకు ఏ చర్యలు తీసుకోవాలి లాంటి వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. మ్యాప్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. అత్యధికంగా వరద ప్రవాహం ఉన్న సమయంలో మున్నేరు నది వద్ద 3 లక్షల 50 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం వచ్చినా తట్టుకునేలా బఫర్ జోన్ నిర్దేశిస్తూ రిటైనింగ్ వాల్ డిజైన్ చేశామని, రికార్డుల ప్రకారం మున్నేరు నది 36 మీటర్ల ఎత్తులో నీరు ప్రవహించిందని, దానిని పరిగణలోకి తీసుకుంటూ రిటైనింగ్ వాల్ నిర్మాణానికి ప్రణాళికలు చేసినట్లు కలెక్టర్ కు నీటిపారుదల అధికారులు వివరించారు. మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణానికి సంబంధించి ఆమోదం పొందిన డిజైన్ ప్రకారం అవసరమైన భూసేకరణ జరగాలన్నారు.ఈసమీక్షలో ఖమ్మం ఆర్డీఓ నరసింహారావు, ఇరిగేషన్ ఎస్ఈ మంగళపూడి వెంకటేశ్వరు, ఈఈ అనన్య, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాసులు, ఖమ్మం అర్బన్, రూరల్ తహసీల్దార్లు రవికుమార్, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



భూసేకరణపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ప్రమాదవశాత్తూ గడ్డివామి దగ్ధం

ముదిగొండ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ వరిగడ్డి వామి దగ్ధమైన సంఘటన ముదిగొండ మండలం వల్లభి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామంలోని బీరంకి వెంకన్నకు చెందిన 200మోపుల వరిగడ్డి వామికి నిప్పంటుకోగా గమనించిన స్థానికులు మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించగా అప్పటికే కాలిబూడిదైంది. ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వచ్చి మంటలను అదుపుచేశారు. సుమారు రూ.20వేల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపాడు.

నేటినుంచి కాకతీయ యూనివర్సిటీ జోనల్ క్రికెట్ పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ జోనల్ స్థాయి క్రికెట్ పోటీలు శుక్రవారం నుంచి 5 వరకు నగరంలోని ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించనున్నారు. నగరంలో మూడు రోజుల పాటు జరగనున్న ఈ పోటీలను స్థానిక కవితా మెమోరియల్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. పోటీలకు అతిధ్య ఖమ్మం జిల్లా జట్టుతో పాటు వరంగల్, ఆదిలాబాద్ జిల్లా జట్లు పాల్గొననున్నాయి. పోటీల లో ఆయా జట్లకు లీగ్ పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన క్రీడాకారులను కేయూ వర్సిటీ జట్టుకు ఎంపిక చేయనున్నారు.

ఉపాధ్యాయ అర్హత పరీక్షలు ప్రారంభం

- 20 వరకు నిర్వహణ
- తొలిరోజు 1894 మంది హాజరు
- డీఈవో సోమశేఖరశర్మ

ఖమ్మం, ఖానాపురంహవేలి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): టీజీ టెట్ 2024 2 పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయని డీఈవో సోమశేఖరశర్మ తెలిపారు. ఈ 20 వరకు అర్హత పరీక్షలు జరుగుతాయన్నారు. మొత్తం 7 పరీక్షా కేంద్రాలలో 2100 మంది అభ్యర్థులకు 1894 మంది పరీక్షలకు హాజరుకాగా 206 మంది పరీక్షలకు హాజరుకాలేదని, మొదటి రోజు పరీక్షకు 7గురు దివ్యాంగులు పరీక్షలకు హాజరైనట్లు డీఈవో తెలిపారు. ఈ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి 11:30గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు రెండో సెషన్‌గా నిర్వహించారు. అభ్యర్థులు పరీక్ష సమయానికి గంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. అభ్యర్థులను తనిఖీచేసిన అనంతరమే పరీక్షా కేంద్రాలలోకి అనుమతించారు. ఈ పరీక్షలు కంప్యూటర్ ఆధారిత పరీక్షగా నిర్వహిస్తుండటంతో మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేదని డిఈవో తెలిపారు. ఈ పరీక్షల నిర్వహణను టీసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షలకు మొత్తం 10 మంది ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులను పరిశీలకులుగా నియమించారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండ ముందస్తు ఏర్పాట్లు చేశారు.



విద్యార్థులను తనిఖీ చేస్తున్న దృశ్యం, తల్లులు పరీక్షకు వెళ్లడంతో చంటి పిల్లలతో వారి కుటుంబసభ్యులు



ప్రభుత్వ పాఠశాలకు కరాటే మాస్టర్ విరాళం

ఖమ్మంరూరల్, జనవరి2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎం.వెంకటాయపాలెం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఖమ్మం పట్టణానికి చెందిన కరాటే మాస్టర్ రాము పది వేల విలువచేసే చెక్కుని సీనియర్ ఉపాధ్యాయురాలు విజయలక్ష్మికి గురువారం అందజేశారు. జిల్లాలో సీనియర్ కరాటే మాస్టర్ అయిన రాము బ్లాక్‌బెల్ట్‌లో సిక్స్‌డాన్ సాధించారు. జిల్లా కోర్ట్‌లో సీనియర్ న్యాయవాదిగా సేవలు అందిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాల్లో పేద విద్యార్థులే ఎక్కువగా చదువుకుంటున్నారని, వారికి కూడా కరాటే నేర్పించాలనే ఉద్దేశంతో అవసరమైన ఫర్నిచర్, ఆటలకు సంబంధించిన వస్తువులను తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వీవీఎస్ ప్రసాద్, శ్రీనివాసరావు, రవీందర్ పాల్గొన్నారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	20 రూ.
వంకాయ	38
గుత్తి వంకాయ	40
బీరకాయ	48
పచ్చిమిర్చి	38
కాకరకాయ	54
బెండకాయ	38
పొట్లకాయ	38
దోసకాయ	34-44
చిక్కుడు	58
నాటుచిక్కుడు	110
గోరుచిక్కుడు	50
క్యాబేజీ	24
దొండ	64-70
సొరకాయ	20
క్యారెట్	58
క్యాప్సికం	74
ఆలుగడ్డ	30
ఉల్లిగడ్డ	40-50
కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు)	180
కొత్తిమీర కట్ట	20

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

CINEMA సినిమా

నగరంలో చిత్రాలు..

వినోద:	ముఫాసా
శ్రీనివాస:	మ్యాక్స్
సాయిరాం:	డ్రింకర్‌సాయి/యూఐ
కేపీఎస్:	పుష్ప 2
తిరుమల:	పుష్ప 2
సినీ గెలాక్సీ:	యూఐ

నిబద్ధత గల కమ్యూనిస్టు బర్ధన్

ఖమ్మంటౌన్,జనవరి2(ఆంధ్రజ్యోతి): తుదిశ్వాసవరకు పేదల అభ్యున్నతికి కోసం పనిచేసిన బర్ధన్ నిబద్ధత గల కమ్యూనిస్టు అని సీపీఐ జాతీయసమితి సభ్యుడు బాగం హేమంతరావు పేర్కొన్నారు. సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి ఏబీ. బర్ధన్ 9వ వర్ధంతి సందర్భంగా గురువారం సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సీపీఐ శతవసంతాల వేళ బర్ధన్ ఆశయాలకు పునరంకితం కావాలని బాగం హేమంతరావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రా బాబు, ఎస్‌కే. జానీమియా, కొండపర్తి గోవిందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, తాటి వేంకటేశ్వరరావు, మేకల శ్రీనివాసరావు, ప్రజాసంఘాల బాధ్యులు తాటి నిర్మల, ఇటికాల రామకృష్ణ, మందా వేంకటేశ్వర్లుచ పోటు పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు సావిత్రిబాయి పూలే జయంతి

ఖమ్మంచర్చికాంపౌండ్, జనవరి2(ఆంధ్రజ్యోతి): నేడు సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా పూలేజయంతి సందర్భంగా మహిళా సాధికారతపై సదస్సు నిర్వహిస్తున్నట్టు వీరనారీమణుల ఆశయసాధన సమితి జిల్లా అధ్యక్షురాలు భూక్యా ఉపేంద్రబాయి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈసదస్సుకు ప్రతీ ఒక్కరు హాజరై సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

రిటైర్డు కానిస్టేబుళ్ల ఆత్మీయ సమ్మేళనం

ఖమ్మంక్రైం, జనవరి2(ఆంధ్రజ్యోతి): 1979 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుళ్లు గురువారం నగరంలోని ఓహోటల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 1979లో 51 మంది అంబర్‌పేట హైదరాబాదులో ట్రైనింగ్ పొందారు. వారి అనుభూతులు పంచుకున్నారు.

మీ సహకారంతోనే జిల్లా ప్రగతి

» నూతన సంవత్సర వేడుకల్లో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మంకలెక్టరేట్,జనవరి2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు మీ సహకారం అవసరమని, అంకితభావంతో పనిచేస్తేనే జిల్లా అభివృద్ధి సాధ్యమని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. గురువారం నూతన సంవత్సర వేడుకలను కలెక్టరేట్ చాంబర్‌లో నిర్వహించారు.ఈసందర్భంగా అదనపుకలెక్టర్లు పి.శ్రీజ, పి.శ్రీనివాస్‌రెడ్డి, ట్రెయినీ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, వివిధ శాఖల జిల్లా అధికారులు,ఉద్యోగులతో కలిసి కేకును కట్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూప్రతీఒక్కరిలో ఆనందం నింపాలని, ప్రభుత్వ ఉద్యోగులు వారి కుటుంబాలలో సంతోషం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం నిర్దేశించిన విధులు విజయవంతంగా నిర్వహిస్తూనే వ్యక్తిగత బాధ్యతలను సైతం పక్కగా చక్కబెట్టుకోవాలని సూచించారు. ప్రణాళికాబద్ధంగా ముందడుగు వేయాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో ఉద్యోగులు ప్రజాప్రతినిధులు,ఉద్యోగులు,ప్రింట్,ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, సాంస్కృతిక సారధి కళాకారులు కలెక్టర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.





క్యాంటీన్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాన్నిస్తున్న టీజీవో నాయకుడు కస్తాల సత్యనారాయణ

క్యాంటీన్‌ను పరిశీలించిన కలెక్టర్

ఖమ్మంకలెక్టరేట్: ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను లాభదాయకంగా నిర్వహించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు.డిమాండ్‌కు అనుగునంగా మెనూ ఉండాలని సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో క్యాంటీన్‌ను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అదనపు కలెక్టర్ పి.శ్రీజ, ట్రెయినీకలెక్టర్ మృణాల్ శ్రేష్ఠలతో కలిసి పరిశీలించారు. క్యాంటీన్‌లో టీతాగారు.క్యాంటీన్ వద్ద పాత్రలు కడిగేందుకు ప్రత్యేకమైన ఏర్పాట్లు చేయాలన్నారు. కలెక్టరేట్ ఉద్యోగుల డిమాండ్ ప్రకారం మెనూ ఏర్పాటు చేయాలని, క్యాంటీన్‌కు వచ్చే ప్రజలు, ఉద్యోగులకు అందిస్తున్నసేవలు, భోజనం నాణ్యత, రుచిపై ఫీడ్ బ్యాక్ తీసుకుంటూ లోటుపాట్లు లేకుండా నిర్వహించాలని సూచించారు.

నూతన సంవత్సరంలో మరింత అభివృద్ధికి కార్యాచరణ

మేయర్, కమిషనర్

ఖమ్మంసంక్షేమవిభాగం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): నూతనసంవత్సరంలో ఖమ్మం నగర పాలక సంస్థ మరింతగా అభివృద్ధికి కార్యచరణ జరపాలని మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. గురువారం తన ఛాంబర్‌లో కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో మేయర్ సమీక్షించారు. కేఎంసీ పరిపాలనలో ఇందిరమ్మ సర్వే, అభివృద్ధి కార్యక్రమాలపై పలు సూచనలు చేశారు. అంతకుముందు మేయర్ పునుకొల్లు నీరజకు కమిషనర్ మొక్కను అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

కమిషనర్‌ను కలిసిన అధికారులు

ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్యను ఖమ్మం ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగేంద్రరెడ్డి, సీఐ కృష్ణ కలిసి



మొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు. కేఎంసీ కాంట్రాక్టర్లు అసోసియేషన్ నాయకులు పసుపులేటి వెంకటేశ్వరరావు, ఏలూరి జుగల్ కిషోర్, బండి సతీష్, శ్రీహరిరాజు, శ్రీధర్, చల్లా శ్రీనివాస్, టీ.శ్రీనివాస్, తమ్మిశెట్టి వెంకటనారాయణ, టీఎంసీ సుజాత, ఏవో శ్రీశైలం, ఆర్వో శ్రీనివాసరావు ఇతర అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

రైతులందరికీ రైతుబంధు అందించాలి

సీపీఎం జిల్లా నాయకుడు రమేష్

ఖమ్మంరూరల్,జనవరి2(ఆంధ్రజ్యోతి): అర్హులైన రైతులందరికీ రైతుబంధు అందించాలని సీపీఎం జిల్లా నాయకుడు, పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ అన్నారు. మండల పరిధిలోని మద్దులపల్లి గ్రామంలో గురువారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాలను అన్నింటినీ అమలు చేయాలన్నారు.చెరుకు టన్నుకు రూ.5000 ఇవ్వాలని ఆయన కోరారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సమస్యలు మరింత తీవ్రమయ్యాయని, రైతువ్యతిరేక చట్టాలు బలవంతంగా రుద్దే ప్రయత్నం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లాకమిటీ సభ్యులు భషీరుద్దీన్, నాయకులు పి.సంగయ్య, నాగేశ్వరరావు, నాగయ్య, వెంకటేశ్వర్లు, బుచ్చిరాములు, సతీష్ పాల్గొన్నారు.

సీఎంఆర్ ఘటనపై విచారణ జరిపించాలి

ఖమ్మంటౌన్,జనవరి2(ఆంధ్రజ్యోతి):మేడ్చల్ సీఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థినుల వీడియో సంఘటనలపై సమగ్ర విచారణ జరిపించాలని ఏఐఎస్‌ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని సీపీఐ జిల్లా కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌లో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. మేడ్చల్ శివార్లలోని సీఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 3నెలలుగా స్పై కెమేరాలు పెట్టి అశ్లీల వీడియోలు తీస్తున్నారన్నారు. కళాశాలలో సౌకర్యాలు, ఇతర అక్రమాలపై ప్రశ్నించిన విద్యార్థినుల వీడియోలను బయట పెడతామని బెదిరించటం అమానుషమన్నారు.కళాశాల యాజమాన్యంపై పోలీసులు సమగ్ర విచారణ చేసి కఠినచర్యలు తీసుకోవాలన్నారు. ఈసమావేశంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శులు శివనాయక్, వంశీ రాకేష్, రాజు, ప్రతాప్, నరేష్, గోపి, రోహిత్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పదోతరగతి పరీక్షల్లో జిల్లా ప్రథమ స్థానంలో నిలవాలి

ఖమ్మంఖానాపురంహవేలి, జనవరి2 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి పరీక్షల్లో ప్రథమ స్థానంలో నిలవాలని అందుకు ఉపాధ్యాయులందరూ సమష్టిగా కృషి చేసి మంచి ఫలితాలను సాధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ అన్నారు. నూతన విద్యా సంవత్సర పీఆర్టీయూ జిల్లా క్యాలెండర్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ గురువారం ఆవిష్కరించారు. విద్యాశాఖ సంఘాలు సమిష్టిగా విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి కృషి చేయడంతో అద్భుతమైన ఫలితాలు వస్తాయి అన్నారు.ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు యలమద్ది వెంకటేశ్వర్లు ,ఉపాధ్యక్షులు అజ్మీర సోమ్లా, రెబ్బ శ్రీనివాసరావు, చిత్తలూరి ప్రసాద్, రత్నకుమార్ వెంకటేశ్వర్ రెడ్డి ,షఫీ విజయ్ అమృత్ కుమార్,జబ్బార్ సతీష్ కేశవరావు, కెవి రమణ, రవి కిరణ్, బత్తుల వెంకటేశ్వర్లు, విజయభాస్కర్, షఫీ పాల్గొన్నారు.



డైరీలను ఆవిష్కరిస్తున్న డీఈవో

టీపీటీఎఫ్ డైరీ ఆవిష్కరణ



టీపీటీఎఫ్ క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న జిల్లా నాయకుడు తేజావత్ వెంగళరావు

నేలకొండపల్లి,జనవరి2(ఆంధ్రజ్యోతి): టీపీటీఎఫ్ 2025 సంవత్సరం నూతన డైరీ, క్యాలెండర్‌ను జిల్లా కార్యదర్శి తేజావత్ వెంగళరావు తహసీల్దార్ జాదవ్ మాణిక్యరావుతో కలిసి ఆవిష్కరించారు. గురువారం మండల వనరుల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో రామారావు, చీనా, భాగ్యలక్ష్మి, జ్యోతిర్మయి, వాణిశ్రీ, గణేష్ పాల్గొన్నారు. ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేస్తూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని మండల విద్యాధికారి చలపతిరావు పిలుపునిచ్చారు. గురువారం నేలకొండపల్లిలో జరిగిన కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్‌ను ఎంఈఓ ఆవిష్కరించారు. విద్యార్థులుపెద్ద సంఖ్యలో ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా బాధ్యులు రావెళ్ళ అరవిందకుమార్, మండల ప్రధాన కార్యదర్శి తొర్తి గురవయ్య, నాయకులు జ్యోతి, నవాబ్‌సాహెబ్, వేణు, అరుణ పాల్గొన్నారు.

కూసుమంచి: కూసుమంచిలో టీపీటీఎఫ్ క్యాలెండరును తహసీల్దార్ కరుణశ్రీ, ఎంపీడీవో వేణుగోపాలరెడ్డి, మండల విద్యాశాఖ అధికారి వీరాస్వామి ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి మల్లయ్య, అధ్యక్ష కార్యదర్శులు యాకయ్య, భద్రు, రాంకోటి, నర్సింహారావు తదితరరులు పాల్గొన్నారు. టీఎస్‌యూటీఎఫ్ క్యాలెండర్‌ను ఎంఈవో రాయల వీరాస్వామి ఆవిష్కరించారు.

సైబర్ నేరగాళ్లపట్ల అప్రమత్తంగా ఉండాలి

ఖమ్మంక్రైం, జనవరి2(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఖానాపురంహవేలి పోలీసు స్టేషన్ సీఐ భానుప్రకాష్ ఒకప్రకటనలో తెలిపారు.క్రెడిట్‌కార్డు డిపార్టుమెంట్ ఫోన్ చేస్తున్నట్లు పరిచయం చేసుకుని నగరానికి చెందిన ఓవ్యక్తి బ్యాంకు అకౌంట్‌ను రూ.66వే దోచుకున్నారని, ఈఘటనపై ఇటీవలే ఫిర్యాదు రావడంతో కేసు నమోదుచేసినట్టు సీఐ పేర్కొన్నారు. కొద్దిసేపటి తర్వాత గమనించి 1930కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయడంతో నిందితుడిని గుర్తించినట్టు తెలిపారు. ప్రజలు చిరునామా, స్థానం, ఫోన్‌నెంబర్, ఆధార్ వ్యక్తిగత వివరాలను ఫోన్‌ద్వారా గానీ, మెసేజ్‌ల ద్వారా గాని ఎవరితోను పంచుకోవద్దని కోరారు.

హోంగార్డుకు సన్మానం

ఖమ్మంక్రైం,జనవరి2(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణపొందిన హోంగార్డు వెంకన్నను సీపీ సునిల్‌దత్ తన కార్యాలయంలో గురువారం సన్మానించారు. దీర్ఘకాలం బాధ్యతాయుతమైన విధులు నిర్వహించారని కొనియాడారు. ఈకార్యక్రమంలో ఏఆర్‌ఏసీపీ సుశీల్‌సింగ్, హోంగార్డు ఆర్ఐ సురేష్ పాల్గొన్నారు.

పదోతరగతి ప్రత్యేక పరీక్షల పరిశీలన



ఖమ్మంఖానాపురంహవేలి, జనవరి2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక పరీక్షను విద్యాశాఖజిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి కేశవపట్నం రవికుమార్ గురువారం పరిశీలించారు. పాఠశాల ప్రార్థనలో పాల్గొని విద్యార్థులకు క్రమశిక్షణ, చదువు ప్రాధాన్యతను వివరించారు. ప్రత్యేక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించి వెంటనే సమాధాన పత్రములు మూల్యాంకనం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కస్తూర్బా బాలికల విద్యాలయం, కొత్తూరు, ఖమ్మంరూరల్‌లో జరుగుతున్న తెలుగు ప్రత్యేక పరీక్ష నిర్వహణను పరిశీలించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లీష్ గ్రామర్ బోధించాలన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ఖమ్మంసంక్షేమవిభాగం, జనవరి2(ఆంధ్రజ్యోతి): ఖమ్మంనగరంలోని రాపర్తినగర్ విద్యుత్ ఉపకేంద్రం నిర్వాహణ సందర్భంగా శుక్రవారం విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని స్థానిక ఏడీఈ నాగార్జున ప్రకటించారు.ఎంవీనగర్, టీఎన్జీవోస్ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పాడుతుందని ప్రకటించారు.

విద్యుత్‌శాఖలో నూతన వేడుకలు



ఎస్ఈ సురేందర్‌కు పుష్ప గుచ్చం అందిస్తున్న అధికారులు

ఖమ్మంసంక్షేమవిభాగం,జనవరి 2(ఆంధ్రజ్యోతి):విద్యుత్‌శాఖలో గురువారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఎస్ఈ సురేందర్‌ను డీఈలు, ఏడీఈలు, ఏఈఈలు పుష్పగుచ్చాలను అందించారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఎవరెస్ట్ శిఖరం ఎక్కేందుకు ఆర్థికసాయం చేయండి

వైరా, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే అతి ఎత్తైన నేపాల్ లోని మౌంట్ ఎవరెస్ట్ శిఖరా న్ని అధిరోహించేందుకు ఆర్థికసాయం అందించాలని ధర్మావత్ మోతీకుమార్ కోరాడు. గురువారం వైరా ఏసీపీ ఎం.ఏ.రెహ్మాన్‌ను కలిసి పోలీసుశాఖ నుంచి ప్రజల ద్వారా ఆర్థిక సహాయానికి తోడ్పాటునివ్వాలని విజ్ఞప్తి చేశాడు. ఇప్పటివరకు ప్రపంచంలో అతి ఎత్తైన దక్షిణాఫ్రికా దేశంలోని మౌంట్ కిలిమంజారో, రష్యాలోని మౌల్‌ఎల్ బ్రూజ్ 40డిగ్రీలు అనే రెండు పర్వతాలను అధిరోహించానని ఇప్పుడు మౌంట్ ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించేందుకు దాతలు ముందుకొచ్చి ఆర్థికసాయం చేయాలని కోరాడు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు అచ్యుత్ తదితరులు పాల్గొన్నారు.

కోటమైసమ్మ తల్లి హుండీల ఆదాయం రూ.94,245

కారేపల్లి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి గ్రామంలోని కోటమైసమ్మతల్లి ఆలయంలోనే హుండీలను సంబందిత అధికారులు గురువారం లెక్కించారు. దీంతో రూ.94,245 ఆదాయం వచ్చిన్నట్లు జిల్లా దేవాదాయశాఖ విభాగం పరిశీలకులు ఎం.అనిల్ తెలిపారు. దసరాపండుగ తరువాత జనవరిలో తిరిగి హుండీలను లెక్కించారు.ఈకార్యక్రమంలో కార్యనిర్వహణ అధికారి కె.వేణుగోపాలచార్యులు, దేవాలయ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ పర్సాపట్టాబి రామారావు, బోడ మంగీలాల్, ఆలయ పూజారి పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల బాహాబాహీ

కల్లూరు,జనవరి 2(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీలోని వర్గా విభేదాలు బయట పడ్డాయి. ఎమ్మెల్యే సమక్షంలో ఓ కాంగ్రెస్ నాయకుడు ప్రసంగిస్తుండగా అదే పార్టీకి చెందిన మరో నాయకుడు అభ్యంతరం తెలపటం ఘర్షణ వాతావరణానికి దారితీసింది. అందుకు గురువారం మండల పరిధిలోని పేరువంచ ఉన్నత పాఠశాలలో కాంగ్రెస్ నాయకుల తోపులాటకు వేదికగా మారింది. ఈ సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. పేరువంచ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నోటుపుస్తకాలు, ప్యాడ్లు పంపిణీ కార్యక్రమానికి సత్తుపల్లి ఎమ్మెల్యే దంపతులు హాజరయ్యారు. సభలో కాంగ్రెస్ నాయకుడు భరత్ ప్రసంగిస్తుండగా అదే పార్టీకి చెందిన నాయకుడు వణుకూరి ప్రభాకరరెడ్డి అభ్యంతర తెలపటం వివాదానికి దారితీసింది. ఎమ్మెల్యే దంపతులు సభ నుంచి వెళ్లిన తరువాత భరత్, ప్రభాకర్ రెడ్డి మద్దతు దారులు పరస్పరం దూషించుకుంటూ ఘర్షణకు తలపడ్డారు. ఈ గలాటతో కాంగ్రెస్ నాయకులు వర్గాలు విడిపోయి తోపులాటకు దిగటం పట్ల ఆ పార్టీ శ్రేణుల్లో విస్మయం వ్యక్తమైంది.

గోనే సంచులను వెంటనే సరఫరా చేయాలి

బోనకల్, జనవరి2(ఆంధ్రజ్యోతి): గోనే సంచులను వెంటనే సరఫరా చేయాలని తెలంగాణా రైతుసంఘ జిల్లా సమితి సభ్యుడు పారుపల్లి నర్సింహారావు డిమాండ్ చేశారు. బోనకల్‌లో గురువారం జరిగిన ఆ సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో సంచుల కొరత వలన వారం రోజులుగా ధాన్యం కొనుగోళ్లు నిలిచి పోయాయని వాపోయారు. ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, జిల్లా సమితి సభ్యుడు తూము రోషన్ కుమార్, ఆకేన పవన్, బొడ్డుపల్లి వెంకటేశ్వర్లు, జయరాజు పాల్గొన్నారు.

శతసహస్ర తులసీ అర్చన

వైరా, జనవరి2(ఆంధ్రజ్యోతి): వైరాలోని శ్రీకోదండ రామాలయంలో సీతారామచంద్ర, లక్ష్మణ స్వామివార్లను శతసహస్ర తులసీ అలంకరణతో అర్చన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు.

డివైడర్‌ను తొలగించిన ప్రైవేట్ వ్యక్తులు

వైరా, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పిల్లి గుడ్డిది అయితే ఎలుక ఎకచక్కాలు ఆడిన చందంలా ఉంది జాతీయ ప్రధాన రహదారి అధికారుల తీరు. ఆశాఖ ఆజామాయిషీ, పర్యవేక్షణ లోపంతో ఏకంగా వైరాలోని జాతీయ ప్రధాన రహదారిలో ఉన్న డివైడర్‌ను ఓ ప్రైవేట్ వ్యక్తి(రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగి) తన సొంత ఆస్తిలా తొలగించాడు. వైరాకు చెందిన ఓ ప్రైవేట్ వ్యక్తి దంపతులిద్దరూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగానే ఉన్నారు. వారికి ప్రభుత్వ నిబంధనలన్నీ తెలిసినప్పటికీ స్థానికంగా ఉన్న అండదండలు చూసుకొని ఎలాంటి అనుమతి లేకుండా ఏకంగా డివైడర్నే తొలగించారు. బుధవారం డివైడర్‌ను తొలగించినప్పటికీ గురువారం వరకు కనీస చర్యలు తీసుకున్న నాథుడే కరువయ్యారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి ఎదురుగా నేషనల్ హైవే రోడ్డుకు రెండోవైపు ఓ ప్రైవేట్ వ్యక్తి తనకున్న కొద్దిపాటి స్థలంలో నివాస భవనం పేరిట అనుమతులు తీసుకొని వాణిజ్య భవనాన్ని నిర్మించాడు. అయినప్పటికీ మునిసిపల్ అధికారులు చోద్యం చూస్తుండిపోయారే తప్ప ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఈ భవనం కింది భాగంలో ఇటీవల ఒక టీస్టాల్‌తో పాటు ఇతర వ్యాపారాలను ఏర్పాటుచేశారు. ఈభవనానికి ఎదురుగా ఉన్న తహసీల్దార్ కార్యాలయం నుంచి అక్కడకు వివిధ అవసరాల కోసం వచ్చే మండలంలోని ప్రజలు ఈ భవనంలోని టీస్టాల్ ఇతర కొనుగోళ్ల కోసం నేరుగా వచ్చేవిధంగా డివైడర్‌ను తొలగించారు. నేషనల్ హైవేపై పట్టపగలే డివైడర్‌ను తొలగించినా ఆశాఖ అధికారులు మాత్రం అడ్రస్ లేరు. వైరాలోని అధికార పలుకుబడి, అండదండలుంటే ప్రభుత్వ ఆస్తులను కొల్లగొట్టినా, ధ్వంసం చేసినా అడిగే నాథుడు కానీ, చర్యలు తీసుకొనే వారు కానీ కరువయ్యారనే విమర్శలు సర్వత్రా విన్పిస్తున్నాయి.



నేషనల్ హైవేపై డివైడర్‌ను తొలగిస్తున్న దృశ్యం

రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన

కొణిజర్ల, జనవరి2(ఆంధ్రజ్యోతి): జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గురువారం కొణిజర్ల సూపర్ జెమ్స్ పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.వైరాఎంవీఐ వరప్రసాద్ మాట్లాడుతూ రోడ్డు భద్రత గురించి తెలుసుకొని తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని విద్యార్థులకు తెలిపారు. రోడ్డుప్రమాదంలో నిండుజీవితాలను కోల్పోతారని తెలిపారు. రోడ్డు భద్రతపై షార్ట్‌ఫిల్మ్ ద్వారా అవగాహన కల్పించారు. ద్విచక్రవాహనదారులు హెల్మెంట్ ధరించాలని, చిన్నారులు వాహనాలు నడపరాదని, కారులో ప్రయాణం చేసే వారు సీట్‌బెల్ట్ ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొణిజర్ల మాజీ సర్పంచ్ సూరంపల్లి రామారావు, వైరా అసిస్టెంట్ మోటర్‌వెహికిల్ ఇన్‌స్పెక్టర్ రవి చంద్ర, పాఠశాల కరస్పాండెంట్ కొణతం ఉమాశంకర్ పాల్గొన్నారు.

గోనె సంచులను సరఫరా చేయాలి



మాట్లాడుతున్న నర్సింహారావు

బోనకల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): గోనె సంచులను వెంటనే సరఫరా చేయాలని తెలంగాణా రైతుసంఘ జిల్లా సమితి సభ్యుడు పారుపల్లి నర్సింహారావు డిమాండ్ చేశారు. బోనకల్‌లో గురువారం జరిగిన ఆ సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో సంచుల కొరత వలన వారం రోజులుగా ధాన్యం కొనుగోళ్లు నిలిచి పోయాయని వాపోయారు. ధాన్యం ఎక్కువ రోజులు ఎండటం వలన తూకంలో నష్టం వాటిల్లుతుందన్నారు. ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, జిల్లా సమితి సభ్యుడు తూము రోషన్ కుమార్, ఆకేన పవన్, బొడ్డుపల్లి వెంకటేశ్వర్లు, జయరాజు తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ హైవేపై డివైడర్‌ను తొలగించిన ప్రైవేట్ వ్యక్తులు

పట్టించుకోని అధికారులు

వైరా, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): 'పిల్లి గుడ్డిది అయితే ఎలుక ఎకచక్కాలు ఆడిన' చందంలా ఉంది జాతీయ ప్రధాన రహదారి అధికారుల తీరు. ఆ శాఖ అజామాయిషీ, పర్యవేక్షణ లోపం తో ఏకంగా వైరాలోని జాతీయ ప్రధాన రహదారిలో ఉన్న డివైడర్‌ను ఓ ప్రైవేట్ వ్యక్తి(రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగి) తన సొంత ఆస్తిలా తొలగించాడు. వైరాకు చెందిన ఓ ప్రైవేట్ వ్యక్తి దంపతులిద్దరూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగానే ఉ న్నారు. వారికి ప్రభుత్వ నిబంధనలన్నీ తెలిసినప్పటికీ స్థానికంగా ఉన్న అండదండలు చూసుకొని ఎలాంటి అనుమతి లేకుండా ఏకంగా డివైడర్‌నే తొలగించారు. బుధవారం డివైడర్‌ను తొలగించినప్పటికీ గురువారం వరకు కనీస చర్యలు తీసుకున్న నాథుడే కరువయ్యారు. తహసీల్దార్ కార్యాలయానికి ఎదురుగా నేషనల్ హైవే రోడ్డుకు రెండోవైపు ఓ ప్రైవేట్ వ్యక్తి తనకున్న కొద్దిపాటి స్థలంలో నివాస భవనం పేరిట అనుమతులు తీసుకొని వాణి జ్య భవనాన్ని నిర్మించాడు. అయినప్పటికీ మునిసిపల్ అధికారులు చోద్యం చూస్తుండిపోయారే తప్ప ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఈ భవనం కింది భాగంలో ఇటీవల ఒక టీస్టాల్‌తో పాటు ఇతర వ్యాపారాలను ఏర్పాటుచేశారు. ఈభవనానికి ఎదురుగా ఉన్న తహసీల్దార్ కార్యాలయం నుంచి అక్కడకు వివిధ అవసరాల కోసం వచ్చే మండలంలోని ప్రజలు ఈ భవనంలోని టీస్టాల్ ఇతర కొనుగోళ్ల కోసం నేరుగా వచ్చేవిధంగా డివైడర్‌ను తొలగించారు. నేషనల్ హైవేపై పట్టపగలే డివైడర్‌ను తొలగించినా ఆశాఖ అధికారులు మాత్రం అడ్రస్ లేరు. వైరాలోని అధికార పలుకుబడి, అండదండలుంటే ప్రభుత్వ ఆస్తులను కొల్లగొట్టినా, ధ్వంసం చేసినా అడిగే నాథుడు కానీ, చర్యలు తీసుకొనేవారు కానీ కరువయ్యారనే విమర్శలు సర్వత్రా విన్పిస్తున్నాయి.



నేషనల్ హైవేపై డివైడర్‌ను తొలగిస్తున్న దృశ్యం

ఎవరెస్ట్ శిఖరం ఎక్కేందుకు ఆర్థికసాయం చేయండి



వైరా ఏసీపీతో పోస్టర్ ఆవిష్కరింపజేస్తున్న మోతీకుమార్

వైరా, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే అతి ఎత్తైన నేపాల్‌లోని మౌంట్ ఎవరెస్ట్ శిఖరా న్ని అధిరోహించేందుకు ఆర్థికసాయం అందించాలని ధర్మావత్ మోతీకుమార్ కోరాడు. గురువారం వైరా ఏసీపీ ఎం.ఎ.రెహ్మాన్‌ను కలిసి పోలీసుశాఖ నుంచి ప్రజల ద్వారా ఆర్థిక సహాయానికి తోడ్పాటునివ్వాలని విజ్ఞప్తి చేశాడు. ఇప్పటివరకు ప్రపంచంలో అతి ఎత్తైన దక్షిణాఫ్రికా దేశంలోని మౌంట్ కిలిమంజారో, రష్యాలోని మౌల్ఎల్‌బ్రూజ్ 40డిగ్రీలు అనే రెండు పర్వతాలను అధిరోహించానని ఇప్పుడు మౌంట్ ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించేందుకు దాతలు ముందుకొచ్చి ఆర్థికసాయం చేయాలని కోరాడు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు అచ్యుత్ తదితరులు పాల్గొన్నారు.

సానుకూల దృక్పథం పెంచుకోవాలి: సండ్ర



సండ్రకు కేక్ తినిపిస్తున్న మునిసిపల్ చైర్మన్ మహేష్

సత్తుపల్లి/కల్లూరు జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆనందం, శాంతి, సంతోషాలతో, సానుకూల దృక్పథం పెంచుకోవాలని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. గురువారం స్థానిక క్యాంపు కార్యాలయంలో 2025 న్యూఇయర్ సందర్భంగా భారీ కేక్ కట్‌చేసిన ఆయన నాయకులు, కార్యకర్తలకు విషెస్ చెబుతూ మిఠాయిలు తినిపించారు. కొత్త సంవత్సరం ప్రారంభం సందర్భంగా మనకు ఇష్టమైన వా రితో ఆనందం, ప్రేమ, పాజిటివ్ జోష్‌ను పెంచుకోవాలన్నారు. 2025సంవత్సరం మంచిమంచి అవకాశాలు రావాలని కోరుకున్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, బీఆర్ఎస్ నాయకులు కొత్తూరు ఉమామహేశ్వరరావు, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, చాంద్‌పాషా, మల్లూరు అంకంరాజు, వనమా వాసు, మోరంపూడి ప్రసాద్, నడ్డి ఆనందరావు, వల్లభనేని పవన్, సురేష్, పర్వతనేని వేణు, కామా శ్యాంసన్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

కల్లూరు (ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని చంద్రుపట్ల గ్రామంలో గురువారం సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పలు కుటుంబాలను పరామర్శించారు. చంద్రుపట్ల మాజీ సర్పంచు గొల్లమందల ప్రసాద్ సోదరుడు గామయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ మేరకు సమాచారం అందుకున్న సండ్ర గామయ్య నివాస గృహంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అదే గ్రామంలో ఇంకా పలు కుటుంబాలను ఆయన పరామర్శించారు. అంతకు ముందు యర్రబోయనపల్లి గ్రామంలో తన అభిమాని నల్లగట్ల స్వామిదాసు కుమార్తె, కుమారుడు నూతన వస్త్రాలంకరణ వేడుకల్లో పాల్గొని చిరంజీవులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కట్టా అజయ్‌కుమార్, మాజీ ఎంపీపీ బీరవల్లి రఘు, నాయకులు కాటంనేని వెంకటేశ్వరరావు, కొమ్మినేని నరిసింహారావు, జక్కంపూడి కిషోర్, కొరకొప్పు ప్రసాద్, పోట్రు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

» ఎంఈవో దామోదరప్రసాద్ » ఉపాధ్యాయ సంఘాల క్యాలెండర్ల ఆవిష్కరణ

తల్లాడ/ముదిగొండ/ఏన్కూరు జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ఉపాధ్యాయులు నిరంతరం కృషిచేయాలని ఎంఈవో ఎస్.దామోదర్‌ప్రసాద్ అన్నారు. గురువారం తల్లాడ మండలం అన్నారుగూడెం ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన మౌళిక సౌకర్యాలు, ప్రతిభావంతులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యాబోధన జరుగుతున్న దృష్ట్యా ఎక్కువమంది పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు షేక్.లాల్‌సాహెబ్, తాళ్లూరి శ్రీనివాసరావు, సీహెచ్.గిరిజారాణి, జీఎస్.మురళీకృష్ణ, శారదా, స్వరాజ్యలక్ష్మీ, సుధా రామారావు పాల్గొన్నారు.

ముదిగొండ (ఆంధ్రజ్యోతి): పీఆర్టీయూ క్యాలెండర్‌ను తహసీల్దార్ సునీతా ఎల్జిబెత్, ఎంపీడీవో శ్రీధర్‌స్వామి గురువారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో రమణయ్య, పీఆర్టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు బంకా గురవయ్య, సాంబశివరావు, జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు అమృత్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి బొ డ్డు సంజీవరావు, నాయకులు శ్రీనివాసరావు, మా జిక్యాలరావు, ఏపూరి రవి, రూప, స్వప్న పాల్గొన్నారు.

ఏన్కూరు, (ఆంధ్రజ్యోతి): పీఆర్‌టీయూ డైరీ, క్యాలెండర్‌ను ఎంపీడీవో ఎస్. రమేష్, ఎంఈవో హెచ్ శ్రీనివాస్ గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేటెడ్ అధ్యక్షుడు కూరాకుల సైదయ్య, జిల్లా కార్యదర్శి మజీద్, రమేష్, సురేష్, ప్రవీణ్, కిరణ్, ప్రేమానందం, వీరయ్య, నర్సింహారావు, రాంబాబు, కృష్ణవేణి, సులోచన, లత పాల్గొన్నారు.

ప్రమాదాలు కొనితెచ్చుకోవద్దు

» ఎంవీఐ వర ప్రసాద్ » రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన



రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ

కొణిజర్ల, జనవరి2 (ఆంధ్రజ్యోతి): జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గురువారం కొణిజర్ల సూపర్‌జెమ్స్ పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వైరా ఎంవీఐ వరప్రసాద్ మాట్లాడుతూ రోడ్డు భద్రత గురించి తెలుసుకొని తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని విద్యార్థులకు తెలిపారు. రోడ్డుప్రమాదంలో నిండుజీవితాలను కోల్పోతారని తెలిపారు. రోడ్డు భద్రత పై షార్ట్‌ఫిల్మ్ ద్వారా అవగాహన కల్పించారు. ద్విచక్రవాహనదారులు హెల్మెంట్ ధరించాలని, చిన్నారులు వాహనాలు నడపరాదని, కారులో ప్రయాణం చేసే వారు సీట్‌బెల్ట్ ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొణిజర్ల మాజీ సర్పంచ్ సూరంపల్లి రామారావు, వైరా అసిస్టెంట్ మోటర్‌వెహికిల్ ఇన్‌స్పెక్టర్ రవిచంద్ర, పాఠశాల కరస్పాండెంట్ కొణతం ఉమాశంకర్, పాపిన్ని మంగపతిరావు, తలారి సామేలు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలకు అండగా కేంద్ర ప్రభుత్వం

బీజేపీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ నంబూరి



మాట్లాడుతున్న రామలింగేశ్వరరావు

సత్తుపల్లిరూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది కూడా కేంద్ర ప్రభుత్వం అన్నదాతలకు అండగా నిలబడనుందని బీజేపీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ నంబూరి రామలింగేశ్వర రావు అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ ఎరువుల ధరలు పెరగగా ఆ మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లిస్తూ కేవలం రూ.1350కే 50కేజీల డీఏపీని రైతులకు అందిస్తుందన్నారు. రెండు పంటల బీమాను కూడా పొడిగిస్తూ తీసుకున్న నిర్ణయం హర్షణీయమన్నారు. కిసాన్ సమ్మాన్ నిధి కింద ఇస్తున్న రూ.6వేలను రూ.10వేలకు పెంచి మూడు విడతలుగా అందించే యోచనలో కేంద్రం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇస్తామన్న రూ.15వేల రైతుభరోసా వెంటనే విడుదలతో పాటు రూ.2లక్షల రుణమాఫీ సగానికి పైగా రైతులకు అందలేదని, వందశాతం అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆచంట నాగస్వామి, పాలకొల్లు శ్రీనివాస్, మట్టా ప్రసాద్, సుదర్శన్ మిశ్రా, పర్సా రాంబాబు, షేక్.రహంతుల్లా, బాణోత్ విజయ్, మేరుగు శేషగిరిరావు, జొన్నలగడ్డ నరేష్, మందా శి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల బాహాబాహీ



పేరువంచలో కాంగ్రెస్‌నాయకులు ఘర్షణకు దిగిన దృశ్యం

కల్లూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీలోని వర్గా విభేదాలు బయట పడ్డాయి. ఎమ్మెల్యే సమక్షంలో ఓ కాంగ్రెస్ నాయకుడు ప్రసంగిస్తుండగా అదే పార్టీకి చెందిన మరో నాయకుడు అభ్యంతరం తెలపటం ఘర్షణ వాతావరణానికి దారితీసింది. అందుకు గురువారం మండల పరిధిలోని పేరువంచ ఉన్నత పాఠశాలలో కాంగ్రెస్ నాయకుల తోపులాటకు వేదికగా మారింది. ఈ సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. పేరువంచ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నోటుపుస్తకాలు, ప్యాడ్లు పంపిణీ కార్యక్రమానికి సత్తుపల్లి ఎమ్మెల్యే దంపతులు హాజరయ్యారు. సభలో కాంగ్రెస్ నాయకుడు భరత్ ప్రసంగిస్తుండగా అదే పార్టీకి చెందిన నాయకుడు వణుకూరి ప్రభాకరరెడ్డి అభ్యంతర తెలపటం వివాదానికి దారితీసింది. ఎమ్మెల్యే దంపతులు సభ నుంచి వెళ్లిన తరువాత భరత్, ప్రభాకర్ రెడ్డి మద్దతు దారులు పరస్పరం దూషించుకుంటూ ఘర్షణకు తలపడ్డారు. ఈ గలాటతో కాంగ్రెస్ నాయకులు వర్గాలు విడిపోయి తోపులాటకు దిగటం పట్ల ఆ పార్టీ శ్రేణుల్లో విస్మయం వ్యక్తమైంది.

మహిళల స్వావలంబన దిశగా అడుగులు



టీ స్టాల్ ప్రారంభిస్తున్న తహసీల్దార్

మధిరటౌన్, జనవరి2 (ఆంధ్రజ్యోతి): మహిళల స్వావలంబన దశగా అడుగులు పడేందుకు దోహదపడేలా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని మధిర తహసీల్దార్ ఆర్. రాంబాబు అన్నారు. గురువారం మధిర తహసీల్దార్ కార్యాలయం వద్ద మహిళా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ టీస్టాల్ ను ఆయన ప్రారంభించారు, స్వయం సహాయక సంఘాలకు చెందిన మ హిళలు ఆర్థికంగా ఎదిగేలా మండలంలో ఇసుక రీచ్‌ల నిర్వహణను వారికి అప్పగించామన్నారు. ఇప్పుడు ఏర్పాటు చేసిన టీస్టాల్ ద్వారా మరికొంత మందికి లబ్ది చేకూరనున్నదని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, సీఐ మధు, మునిసిపల్ కమిషనర్ సంపత్ కుమార్, ఏపీఎం రాంబాబు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ అధికారులకు ఘన సన్మానం

కల్లూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కల్లూరు ఐసీడీఎస్ ప్రాజెక్టులో గురువారం ఆశాఖ తరఫున పలువురు అధికారులకు ఘన సన్మానం చేశారు. డీడబ్ల్యూవో రాంగోపాలరెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఐసీడీఎస్ మహిళ విభాగం నుంచి (టీఎన్జీవో) గెజిటెడ్ అధికారుల సంఘం ఉపాధ్యక్షురాలుగా ఎంపికైన కల్లూరు ప్రాజెక్టు అధికారిణి సిహెచ్ నిర్మల జ్యోతి, ఈ ప్రాజెక్టు నుంచి ఏసీడీపీవోగా ఉద్యోగ విరమణ పొందిన ఎస్‌కే మహంబూబ్ అలీకి, ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాజెక్టుల సీడీపీవోలు, ఏసీడీపీవోలు మినిస్టీరియల్ ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. మండల పరిలధిలోని రావికంపాడు గ్రామానికి చెందిన వికలాంగ నిరుద్యోగి వల్లబోయన నాగరాజుకు వ్యాపారం నిమిత్తం డిడబ్ల్యువో రాంగోపాలరెడ్డి రూ. 50 వేల చెక్కును ఆర్థిక సహాయం అందజేశారు.

వేతన ఒప్పందాన్ని అమలు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

సత్తుపల్లిరూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): సివిల్ సప్లయ్‌లో పనిచేస్తున్న హమాలీ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వ వేతన ఒప్పందాన్ని తక్షణమే అమలు చేయాలని టీయూసీఐ, సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సివిల్ సప్లయ్ గోదాం వద్ద ధర్నా నిర్వహించి ఇన్‌చార్జ్ మేనేజర్ శేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అమర్లపూడి శరత్, కొలికపోగు సర్వేశ్వరరావు, నిమ్మటూరి రామకృష్ణ, మోరంపూడి పాండురంగారావు, దండు ఆదినారాయణ, తడికమళ్ల యోబు, కాశీ, శ్వేత, వలిబాబు, వెంకటేశ్వరరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

కోటమైసమ్మ తల్లి హుండీ ఆదాయం లెక్కింపు

కారేపల్లి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి గ్రామంలోని కోటమైసమ్మతల్లి ఆలయంలోనే హుండీలను సంబంధిత అధికారులు గురువారం లెక్కించారు. దీంతో రూ.94,245 ఆదాయం వచ్చినట్లు జిల్లా దేవాదాయ శాఖ విభాగం పరిశీలకులు ఎం.అనిల్ తెలిపారు. ఈకార్యక్రమంలో కార్యనిర్వహణ అధికారి కె.వెణుగోపాలచార్యులు, దేవాలయ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ పర్సాపట్టాభి రామారావు, స్థానికులు బోడ మంగీలాల్, ఆలయ పూజారి కైలాష్‌శర్మ, సిబ్బంది పగడాల మోహన్‌కృష్ణ, పర్సా సాయి తదితరులు పాల్గొన్నారు.

శత సహస్ర తులసి అర్చన



వైరా, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): వైరాలోని శ్రీకోదండ రామాలయంలో సీతారామచంద్ర, లక్ష్మణ స్వామివార్లను శతసహస్ర తులసి అలంకరణతో అర్చన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. శంఖుషక్రనామ పుష్ప పత్ర అలంకరణతో సీతారామ చంద్ర, లక్ష్మణస్వామివార్లు శోభిల్లారు.భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే కట్టా వెంకటనర్సయ్యకు ఘన నివాళి

మధిరటౌన్/కల్లూరు జనవరి2 (ఆంధ్రజ్యోతి): నమ్మిన సిద్ధాంతం కోసం చివరి దాకా నిలిచిన వ్యక్తి కట్టా వెంకటనరసయ్య అని మధిర మునిసిపల్ సీపీఎం కౌన్సిలర్ కట్టా గాంధీ అన్నారు. మధిర మాజీ ఎమ్మెల్యే వెంకటనర్సయ్య నాలుగో వర్ధంతి సంధర్బంగా గురువారం మధిర లోని మానసిక వికలాంగుల సేవా సదనం తో పాటు వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహించారు. ఆయన మాట్లాడుతు రెండు సార్లు మధిర ఎమ్మెల్యేగా పనిచేసిన ఆయన ప్రజల మదిలో చెరగని ముద్ర వేసి ధన్యజీవిగా నిలిచారని అన్నారు. ఈ కార్యక్రమంలో కట్టా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు, (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పోచారం గ్రామంలో గురువారం గ్రామస్థుల ఆధ్వర్యంలో మధిర మాజీ ఎమ్మెల్యే కట్టా వెంకటనరయ్య మూడవ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానిక సెంటర్‌లో గల ఎమ్మెల్యే వెంకటనర్సయ్య విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి ఘనమైన నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు చింతలపూడి బాబిష్టార్, చావా వీరభద్రం, తాళూరు శ్రీనివాసరావు, దేవ భక్తుని వీర రాఘవరావు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్య సాధనతో ముందుకు సాగాలి

సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి



విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే దంపతులు

పెనుబల్లి/కల్లూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువులో లక్ష్యాన్ని నిర్మించుకొని ముందుకు సాగాలని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. గురువారం పెనుబల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఆశ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నోట్‌పుస్తకాలను రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్‌తో కలిసి అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుకున్న తాము ఉన్నతస్థాయికి ఎదిగామని మీరు కూడా లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. డాక్టర్ మట్టా దయానంద్ మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్‌ను పక్కనపెట్టి చదువులపై దృష్టిసారించాలని సూచించారు. కార్యక్రమంలో కల్లూరు ఏఎంసీ చైర్మన్ బాగం నీరజచౌదరి, వైస్‌చైర్మన్ రాచబోయిన కోటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు చీకటి రామారావు, పంది వెంకటేశ్వరరావు, చీకటి చిన్ననర్సింహారావు, బుక్కా కృష్ణవేణి, పొట్లపల్లి వెంకటేశ్వరరావు, బొర్రా కోటేశ్వరరావు, వేముల కృష్ణయ్య, పలు గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కల్లూరు (ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని పేరువంచ గ్రామంలోని ఉన్నత పాఠశాలలో గురువారం సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, దయానంద్‌లు విద్యార్థులకు నోటు పుస్తకాలు, ప్యాడ్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ నాయకుడు కీసర మధుసూదన్‌రెడ్డి తమ వంతుగా విద్యార్థులకు పై విధంగా చేయూత నిచ్చేందుకు రూ.50 వేలు వితరణ చేశారు. కాంగ్రెస్ నాయకుడు దయానద్ జన్మదినం సందర్భంగా ముందస్తుగా కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమలో ఏఎంసీ చైర్మన్ భాగం నీరజాదేవి, సీడీసీ చైర్మన్ కస్తాల నరేంద్ర, పాఠశాల హెచ్ఎం సుదర్శన్‌రావు, దాత కీసర మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కీసర శ్రీనివాసరెడ్డి, కీసర మెహనరెడ్డి కోనూరి పుల్లయ్య, ముళ్లపాటి నాగేశ్వరరావు, గాదే కిరణ్, భరత్, ప్రభాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.